



● పల్నాడులో వరి పొలాలు

సిరుల వరి



ఖరీఫ్ వరి సాగు కళకళలాడుతోంది. అన్నదాతలు అంచనాలకు మించి వరి సేద్యం చేశారు. గతేడాది కంటే సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. గత ఖరీఫ్, రబీ సీజన్‌లలో ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో రైతులు వరి సాగు వైపు మొగ్గు చూపారు. మిరప సాగు చేసే రైతులు కూడా ఈ సారి వరి సాగు చేపట్టారు. వరినాట్లు చివరి దశకు చేరుకున్నాయి. ఈ వారంలో పూర్తవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. నాగార్జునసాగర్.. కృష్ణా డెల్టా ఆయకట్టు పరిధి పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 5.31 లక్షల ఎకరాల్లో వరి సాగైంది.

అంచనాలకు మించి వరి సేద్యం

- ఖరీఫ్ కళకళ.. 5.31 లక్షల ఎకరాల్లో సాగు
- అనుకూలించిన పరిస్థితులు
- పల్నాడు జిల్లాలో 43 వేల ఎకరాలు అధికం

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

సాగర్.. కృష్ణా డెల్టా ఆయకట్టు ప్రాంతాలు ధాన్యాగారంగా పేరొందాయి. ఖరీఫ్‌లో వరి సాగు పెరగడంతోనే యూరియా సమస్యలు తలెత్తుతున్నాయి. గతేడాది సాగు అంచనాలతో యూరియా సరఫరా చేయడంతో.. కొరత ఏర్పడుతోంది. పల్నాడు జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 96,498 ఎకరాలు కాగా 1,29,630 ఎకరాల్లో ఇప్పటికి వరి సాగైంది. గతేడాది 85,990 ఎకరాల్లో వరి పండించారు. క్రితం సారి కంటే 43,640 ఎకరాల్లో వరి సాగు పెరగడం గమనార్హం. ఇంకా మూడు నుంచి నాలుగు వేల ఎకరాల్లో వరినాట్లు వేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది.

● గుంటూరు జిల్లాలో సాధారణ వరి సాగు విస్తీర్ణం 1,53,143 ఎకరాలు కాగా 1,53,868 ఎకరాల్లో ఇప్పటికే వరి సాగైంది. మరో రెండు నుంచి మూడు వేల ఎకరాల్లో వరినాట్లు వేసే అవకాశం ఉంది. గతేడాది 1,40,935 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ ఏడాది 12,933 ఎకరాలు వరి సాగు అధికం. ఈ ఏడాది ఖరీఫ్ ధాన్యం దిగుబడులు కూడా పెద్ద ఎత్తున పెరగనున్నాయి. ప్రభుత్వం వరి దిగుబడులను ముందుగానే అంచనా వేసి ఇందుకు తగ్గట్టుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ దిశగా పౌరసరఫరాల శాఖ చర్యలు చేట్టాలి.

● బాపట్ల జిల్లాలో వరి ప్రధానంగా సాగు చేస్తారు. ఈ జిల్లాలో కృష్ణా డెల్టా.. సాగర్ ఆయకట్టులు ఉన్నాయి. వరి సాధారణ సాగు విస్తీర్ణం 2,47,245 ఎకరాలు కాగా ఇప్పటికే 2,48,193 ఎకరాల్లో సాగైంది. సాగర్ ఆయకట్టులో చివరి భూముల్లో వరి నాట్లు ఇంకా జరుగుతున్నాయి. ఇంకో ఐదు వేల ఎకరాల్లో వరి నాట్లు వేసే అవకాశం ఉంది. గతేడాది సాగు విస్తీర్ణం చూస్తే 2,20,903 ఎకరాలు కాగా.. ఈ ఏడాది 27,290 ఎకరాలు అధికం.

నాలుగేళ్లలో వరి సాగు ఎకరాల్లో..

జిల్లా	2022	2023	2024	2025
పల్నాడు	92,773	27,675	85,990	1,29,630
బాపట్ల	2,42,755	2,13,383	2,20,903	2,48,193
గుంటూరు	1,54,895	1,39,005	1,45,935	1,53,935

బంధిఖానాలో.. బాల్యం



ఆట పాటలు.. కేరింతలు.. తుళ్లింతలు.. గిల్లికజ్జాలు.. అందమైన ఊహలు.. ఇలా ఎన్నో మధురానుభూతుల్లో సాగాల్సిన బాల్యం వివాహ బంధంలో బందీగా మారిపోతోంది. అనాదిగా సమాజాన్ని పట్టి పీడిస్తున్న దురాచారాల్లో బాల్య వివాహం కూడా ఒకటి. 150 ఏళ్ల క్రితం 1872లోనే బాల్య వివాహాలను రద్దు చేస్తూ అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం చట్టం చేసినా అది నేటికీ సమాజాన్ని వీడటం లేదు. ఫలితంగా ముక్కుపచ్చలారని ఎంతో మంది చిన్నారుల జీవితాలు మూడు ముళ్ల బంధంలో చిక్కి శల్యమవుతున్నాయి. బాల్య వివాహాల సంఖ్య ఇటీవల కాలంలో భారీగా పెరుగుతుండడం సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. కొవిడ్ అనంతర కాలంలో ఈ సంఖ్య గణనీయంగా పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి.

- పల్లెల కంటే.. పట్టణాల్లో అధికంగా చిన్నారి పెళ్లి కూతుళ్లు..
- బాల్య వివాహాల్లో రాష్ట్ర సగటు దాటిన ఉమ్మడి గుంటూరు
- 35.4 శాతంతో రాష్ట్రంలో నాలుగో స్థానం
- కోవిడ్ అనంతరం ఆందోళనకరంగా పెరుగుదల

- గుంటూరు

8 లో..

నాలుగో స్థానంలో ఉమ్మడి జిల్లా..

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే లెక్కల ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2019- 20లో 35.4 శాతం బాల్య వివాహాలు జరిగాయి. ఇది రాష్ట్ర సగటు 29.3 శాతం కంటే 6 శాతం అధికం. కోవిడ్ అనంతర కాలంలో ఈ సంఖ్య మరింత పెరిగింది. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అడ్డుకుంటున్న కేసుల సంఖ్య ఏటికేడాది పెరగడమే ఇందుకు నిదర్శనం. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2018లో 31 బాల్య వివాహాలను ఐసీడీఎస్ అధికారులు అడ్డుకోగా.. ఆ సంఖ్య 2019 నాటికి 23కు తగ్గింది. అయితే కొవిడ్ ప్రభావం మొదలైన 2020లో 34, 2021లో 37 వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. ఆ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే 12 బాల్య వివాహాలను అడ్డుకున్నారు.



పనిచేయని చట్టాలు

బాల్య వివాహాల రద్దు కోసం ప్రభుత్వం అనేక చట్టాలు చేస్తోంది. బ్రిటీష్ పాలనలోనే పలు చట్టాలు జరిగాయి. 1872లో అప్పటి గవర్నర్ జనరల్ మేయో తొలిసారి బాల్య వివాహ రద్దు చట్టం చేశారు. ఆ తరువాత 1929లో లార్డ్ ఇర్విన్ కాలంలో 'శారద' చట్టం చేశారు. ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజెస్ యాక్ట్-2006ను చేశారు. ఈ చట్టం ప్రకారం ఆడపిల్లల వివాహ వయసు 18, మగపిల్లల వివాహ వయసు 21గా నిర్ణయించారు. కిందటేడాది ఈ చట్టాన్ని సవరించి ఇద్దరి వయసును 21 ఏళ్లకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

తరచూ నేరాలకు పాల్పడే వారిపై రౌడీషీట్లు

- గస్తీ సిబ్బందికి లాఠీలు, టార్చ్‌లైట్లు తప్పనిసరి
- నేర సమీక్షలో ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలు

గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తరచూ నేరాలకు పాల్పడే వారిపై రౌడీషీట్లు తెరవాలని ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన నేర సమీక్షా సమావేశంలో ఆయన పోలీస్ అధి కారులు, సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాల న్నారు. రాత్రి గస్తీ సిబ్బంది లాఠీలు, టార్చ్‌లైట్లు, విజిల్స్ తప్పనిసరిగా తీసుకెళ్లాల న్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజలకు సత్వర, నాణ్యమైన సేవలందించడంపై దృష్టి సారించాలని ఆదేశించారు. సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకో వాలన్నారు. మహిళల నుంచి అందే ఫిర్యాదులపై వెంటనే స్పందించి, ఎఫ్ఐఆర్ నమోదు చేయదగిన నేరమైతే వెంటనే నమోదు చేయాలన్నారు. మహి ళలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాల న్నారు. శక్తి కాల్స్ అందిన వెంటనే స్పందించి, ఘటన స్థలానికి చేరుకుని పరిష్కారం చూపించాలన్నారు. రాత్రి గస్తీ వ్యవస్థను ఏ, బీ, సీ, డీ బృందాలుగా విభజించి, విధులు వలయాకార పద్ధతిలో అమలు చేయాలన్నారు. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాత్రి 10:30 గంటలలోపు దుకాణాలు మూసివేయించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రంకెన్‌డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. అర్ధరాత్రి సమయంలో రోడ్లపై అల్లర్లు సృష్టించే వారిపై టౌన్ న్యూసెన్స్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. సాంకేతిక పరికరాలను వినియోగించి పరారీలో ఉన్న నేరస్తులు, తప్పిపోయిన వ్యక్తుల ఆచూకీ కనుగొనాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు జి.వి.రమణమూర్తి, ఏ.టి.వి. రవికుమార్, ఏ. హనుమంతు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ లక్ష్యం 50 ఎంటీలు

కొనుగోళ్లపై అవగాహన కలిగి ఉండాలి ● శిక్షణ తరగతుల్లో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న జేసీ శ్రీవాస్తవ

గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో 50 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించినట్లు జేసీ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఏపీ పౌర సరఫరాల సంస్థ అధ్వర్యంలో ధాన్యం సేకరణపై అవగాహన, శిక్షణ తరగతులు గురువారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వ విధివిధానాల గురించి సంబంధిత సిబ్బంది స్పష్టమైన అవగాహన పెంచుకోవాలని ఆదేశించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వహణకు, సంక్షేమ హాస్టల్స్ కోసం గుంటూరు జిల్లాను ప్రత్యేకంగా ఎంపిక చేసి ధాన్యం సేకరణ చేయనున్నట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయన్నారు. ధాన్యం కనీస మద్దతు ధర సాధారణ రకం(కామన్) క్వింటాల్ రూ.2369, గ్రేడ్- ఏ రకము రూ.2,389గా నిర్ణయించినట్లు తెలిపారు. గత సంవత్సరం కన్నా రూ.69 అధకంగా చెల్లించడం జరుగుతుందన్నారు. గ్రేడ్ ఏ రకం సేకరణలో ఐదు నాణ్యతా పరీక్షలు నిర్వహించాలన్నారు. 17 శాతం కంటే ఎక్కువ తేమ శాతం ఉంటే ఆరబెట్టుకుని 7 శాతం కంటే తక్కువగా వచ్చినప్పుడే రైతులు విక్రయిం చేలా టెక్నికల్ అసిస్టెంట్లు చూడాలన్నారు. ఏ రైతు కూడా కనీస మద్దతు ధరకన్నా తక్కువకు అమ్ముకోవాల్సిన పని లేదన్నారు. రైతు తన పంటను ఈ-పంటలో నమోదు చేసుకొని ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలని సూచించారు. రైతులకు 40 కేజీల గోనె సంచులు రూ.4.74కి అందిస్తామన్నారు. ధాన్యం నాణ్యతను పరిశీలించడానికి సిబ్బంది కళ్లాల వద్దకే వస్తారన్నారు. పౌర సరఫరాల జిల్లా మేనేజర్ తులసి మాట్లాడుతూ ధాన్యం విక్రయించడంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా, ఏదైనా ఫిర్యాదు చేయడానికి టోల్ ఫ్రీ 1967లో, కంట్రోలు రూమ్ 9491392717 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు. ఈ సమావేశంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బండ్లమూడి వెంకయ్యచౌదరి, వ్యవసాయాధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు, తహసీల్దార్లు, హెల్పర్లు, మిల్లర్లు పాల్గొన్నారు.



వాహన తాళాలు అందజేస్తున్న కమిషనర్ కన్నబాబు

పచ్చదనానికి ప్రోత్సాహం

సీఆర్‌డీఏ సెంట్రల్ నర్సరీ నిర్వహణకు వాహనాలు

తుళ్లూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో పచ్చదనం పెంపొందించేందుకు రాజధాని ప్రాధికార సంస్థ(ఏపీ సీఆర్‌డీఏ) అమరావతిలోని ఉద్దండరాయునిపాలెంలో 20 ఎకరాల్లో విస్తరించి ఉన్న సీఆర్‌డీఏ సెంట్రల్ నర్సరీ, అవెన్యూ మొక్కల పెంపకం నిర్వహణకు నూతన వాహనాలు అందజేసింది. నర్సరీ నిర్వహణకు 47 హెచ్‌పీ ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్, ట్రైలర్‌ను తాజాగా సీఆర్‌డీఏ కొనుగోలు చేసింది. సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు సంబంధిత అధికారులకు వాహనాల తాళాలను అందజేశారు. ప్రజా రాజధాని అమరావతిలో పచ్చదనం పెంపొందించేందుకు సీఆర్‌డీఏ కట్టుబడి ఉందని కమిషనర్ తెలిపారు. సీఆర్‌డీఏ ల్యాండ్ స్కేప్ అండ్ ఎన్విరాన్‌మెంట్ విభాగ అదనపు డైరెక్టర్ ఎం హరిప్రసాద్, హార్టికల్చర్ డిప్యూటీ డైరక్టర్ బీ జాన్ బెన్నీ, హార్టికల్చర్ అధికారి ఏ శివరామకృష్ణ పాల్గొన్నారు.

భార్యతో కలిసి చోరీలు

- 13 కేసులు ఛేదించిన కొల్లిపర పోలీసులు
- దంపతుల అరెస్టు.. ఆభరణాలు, నగదు స్వాధీనం

గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ భార్యభర్తలు.. తమ సమీప గ్రామాల్లో పగలు బైక్‌పై తిరుగుతూ తాళాలు వేసిన ఇళ్లను గుర్తిస్తారు. ఆ ఇళ్లల్లో రాత్రిళ్లు దొంగతనాలు చేస్తుంటారు. ఆ దంపతులను కొల్లిపర పోలీసులు అరెస్టు చేసి 13 చోరీ కేసులను ఛేదించారు. కొల్లిపర మండలం తూములూరు గ్రామానికి చెందిన కటారి వెంకటేశ్వర్లు, తేజ నాగమణి దంపతులను అరెస్టు చేసి వారి నుంచి 173.19 గ్రాముల బంగారం, 226.36 గ్రాముల వెండి, రూ.రెండు లక్షల 15 వేల నగదు, ఒక టెలివిజన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గురువారం పోలీస్ కార్యాలయంలో నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలను ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. తూములూరుకి చెందిన మాటూరి మధుసూదనరావు గత నెల 28న ఇంటికి తాళాలు వేసి వేరే ఊరికి వెళ్లి ఈ నెల 2న తిరిగి వచ్చే సరికి చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ కోటేశ్వరరావు సీసీ కెమెరా ఆధారంగా వెంకటేశ్వర్లుని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడ్ని విచారించగా భార్యతో కలసి వివిధ గ్రామాల్లో 13 దొంగతనాలు చేసినట్లు అంగీ కరించాడు. ఆ దంపతులు తమ సొంత ఊరు, మండలంలోనే దొంగతనాలు చేస్తూ ఎవరికి అనుమానం రాకుండా వ్యవహరించేవారని ఎస్పీ తెలిపారు. తెనాలి డీఎస్పీ జనార్ధనరావు, రూరల్ సీఐ ఉమేష్, ఎస్ఐ కోటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్స్ రామకోటేశ్వరరావు, మురళీకృష్ణ, కానిస్టేబుల్స్ కూర్మారావు, శివరామకృష్ణలను ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.



బంగారు ఆభరణాలు పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, తెనాలి డీఎస్పీ జనార్ధనరావు

కొలిక్కిరాని బ్రిడ్జి పనులు

మిర్చి సీజన్‌కు యార్డు వద్ద ఫ్లైవోవర్ సమస్యాత్మకం ● ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలంటున్న వ్యాపారులు



గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు వద్ద నల్లపాడు రోడ్డులో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ నిర్మిస్తోన్న ఫ్లైవోవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఒక కొలిక్కి రాలేదు. పనులు ప్రారంభమై సంవత్సరాలు గడుస్తుండగా ఎప్పటికి పూర్తి చేస్తారో తెలియడంలేదు. గత సీజన్‌లో రోడ్డు విస్తరణ పనులు జరగడం వలన పెద్దగా సమస్య తలెత్తలేదు. ఇప్పుడు మిర్చి ఎరైవల్ జరిగే యార్డు గేటుకు ఎదురుగా నిర్మిస్తోన్న పిల్లర్ల పనులు కారణంగా లోపలికి లారీలు, ఇతర వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. ప్రస్తుతం అన్‌సీజన్ కావడంతో యార్డులోకి స్వల్ప సంఖ్యలోనే లారీలు వస్తున్నాయి. మరో రెండు నెలల్లో ప్రారంభం కానున్న సీజన్ సమయంలో రోజుకు వందల సంఖ్యలో లారీలు యార్డులోకి వస్తాయి. అప్పుడు కచ్చితంగా సమస్య తలెత్తుంది. అదే జరిగితే కొనుగోళ్లు సక్రమంగా జరగక రైతులకు నష్టం కలిగే పరిస్థితులు ఉత్పన్నమౌతాయి. సాధారణంగా సీజన్‌లో నిత్యం యార్డు వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంటుంది. గుంటూరు నుంచి హైదరాబాద్‌కు, మరోవైపు అనంతపురం వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నాలుగు వరసల ఈ రహదారిలో సెంట్రల్ మీడియన్ కూడా ఉన్నది. అయినా మిర్చియార్డుకు వచ్చే వాహనాలతో కొన్ని సందర్భాల్లో చుట్టు గుంట వరకు ట్రాఫిక్ నిలిచిపోతున్నది. ఆ సమయంలో చిలకలూరి పేట రోడ్డులోకి వాహనాలను మళ్లించి ఇన్నర్ రింగురోడ్డులో నుంచి నల్లపాడు వద్దకు చేర్చి అక్కడి నుంచి రెగ్యులర్ రూట్‌లో ప్రయాణిం చేలా పోలీసులు క్రమబద్ధీకరణ చర్యలు చేపడు తారు. మిర్చియార్డు వద్ద కచ్చితంగా ఫ్లైవోవర్ అవసరమని భావించిన ఎన్‌హెచ్‌ఏఐ కేంద్రానికి నివేదించి నిధులు కూడా మంజూరు చేయించిం ది. దాదాపుగా రూ.108 కోట్ల అంచనాతో పనులు జరుగుతున్నాయి. అయితే పనులు ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కు అన్న చందంగా ఉన్నాయి.

ఆరు నెలలు పనులు ఆపాలి..

ప్రస్తుతం సర్వీసు రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేస్తున్నారు. అలానే యార్డు గేటు వద్ద పిల్లర్లు నిర్మించాల్సి ఉన్నది. ఇందుకోసం గ్రౌండ్‌వర్కు ప్రారంభించారు. ఈ కారణంగా సర్వీసు రోడ్డులోకి ట్రాఫిక్‌ని డైవర్షన్ చేశారు. దీంతో ఇక్కడ ట్రాఫిక్ నెమ్మదిగా కదులుతున్నది. ఇప్పుడే ఇలా ఉంటే సీజన్‌లో కచ్చితంగా ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సీజన్ ముగిసే వరకు అంటే ఆరు నెలలు పనులు నిలిపేయాలని వ్యాపారులు మార్కెటింగ్ శాఖకు నివేదించారు. లేకుంటే ప్రత్యామ్నాయంగా యార్డులోకి ప్రవేశించేందుకు ఉన్న మార్గాల్లో ఆక్రమణలను తొలగించి రోడ్లను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. దీనిపై కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసానితో చర్చించాలని వ్యాపారులు, అధికారులు నిర్ణయించారు. అలానే ఎన్‌హెచ్‌ఏఐకి కూడా ప్రభుత్వం ద్వారా లేఖ రాయించాలని భావిస్తున్నారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

- తాత్కాలిక దుకాణాలకు 17లోగా దరఖాస్తులు చేసుకోవాలి



గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగను పురస్కరించుకుని అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ నెల 20న దీపావళి పండగ సందర్భంగా తాత్కాలిక షాపులు పెట్టుకునేందుకు అనువైన ఖాళీ ప్రదేశాలను గుర్తించాలని అధికారులను ఇప్పటికే ఆదేశించామ న్నారు. బాణసంచా విక్రయించు షాపుల అనుమతుల కు ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించా లని తెలిపారు. విక్రయదారులు, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ కోరారు. ఎటువంటి ప్రమాద పరిస్థితులకు తావివ్వరాదని సూచించారు. లైసెన్స్ కలిగి ఉన్న అమ్మకందారుల నుంచే బాణసంచా కొనుగోలు చేయాలన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య శబ్దాలను వెదజల్లే బాణాసంచా పేల్చరాదన్నారు.

టీడీపీకి కార్యకర్తలే సైనికులు

● నష్టపోయిన ప్రతి కుటుంబానికి అండగా ఉంటాం : మంత్రి లోకేశ్



మంత్రి లోకేశ్‌తో దివంగత శేషగిరిరావు కుటుంబ సభ్యులు

రెంటచింతల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలే సైనికులని.. వైసీపీ అరాచకపాలనలో నష్టపోయిన ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉండి అన్ని విధాల ఆదుకుంటామని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. పాలువాయిగేట్ గ్రామానికి చెందిన దివంగత నంబూరి శేషగిరిరావు సతీమణి కృష్ణవేణి కుటుంబ సభ్యులతో కలిసి ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి లోకేశ్‌ను గురువారం కలిశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో పాలువాయిగేట్ పోలింగ్ బూత్‌లో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసం చేస్తుండగా ఏజెంట్‌గా ఉన్న శేషగిరిరావు ప్రాణాలకు తెగించి పోరాడడంతో.. వైసీపీ మూకల చేతిలో తీవ్రంగా గాయపడిన విషయాన్ని లోకేశ్‌కు వివరించారు. జూలై 20న గుండెపోటుతో భర్త శేషగిరిరావు మృతి చెందారని కృష్ణవేణి చెప్పారు. దీంతో శేషగిరిరావు పార్టీ కోసం చేసిన త్యాగం వృథాకాదని, అందరం టీడీపీ కుటుంబ సభ్యులమని లోకేశ్ వారికి ధైర్యం చెప్పారు. వారి బాగోగులను వ్యక్తిగతంగా తాను చూసుకుంటానని హామీ ఇచ్చారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న ప్రతి ఒక్కర్నీ గుండెల్లో పెట్టుకుని గౌరవిస్తామని భరోసా కల్పించారు.

ప్రజాదరణ లేని పర్యటనలతో జగన్ కాలక్షేపం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజాదరణ లేని పర్యటనలతో జగన్ కాలక్షేపం చేస్తున్నారని, మళ్ళీ మళ్ళీ అవే అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో విమర్శించారు. అధికారంతో పాటు మెడికల్ కాలేజీలనే బంగారు బాతుల్ని కోల్పోయానన్న బాధతోనే ప్రభుత్వంపై జగన్ విషం కక్కుతున్నారని ఆరోపించారు. జాతీయ ఆరోగ్య మిషన్ నిధుల్ని దారి మళ్లించి, జనం ఆరోగ్యం కాపాడానని చెప్పడం జగన్‌కే చెల్లిందన్నారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ బకాయిలు ఎగ్గొట్టిన జగన్.. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించానని చెప్పడం సిగ్గుచేటన్నారు. 108, 104 ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా రోడ్డెక్కించడం జగన్ వైద్య రంగంలో చేసిన అభివృద్ధి అని ఎద్దేవా చేశారు.

53,371 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 54,252 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 53,371 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 10,401 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12500
334	10000	14500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14000	334	10500	14600
273	---	---	నెంబరు. 5	10000	14200
341	10000	15200	341	10000	15300
4884	----	----	4884	10000	14500
సూపర్ 10	----	---	సూపర్ 10	11000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15000	తేజ	10000	15200
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15500
బ్యాడిగి	10500	15600	దేవనూరు డీలక్స్	10500	14200
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7700

4 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల




సాగర్‌లో 4 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు గురువారం 4 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 589.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాల్వ ద్వారా 10,040, ఎడమ కాలువ ద్వారా 7,272, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,779, 4 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు మేర ఎత్తి 32,400, మొత్తం ఔట్ ఫ్లో 83,491 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 83,491 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు 64,012 క్యూసెక్కులు..

రెంటచింతల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకుగాను 3 గేట్లను 3.5 మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 55,674 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి అనంతరం టీఆర్‌సీ ద్వారా 8338 క్యూసెక్కులు.. మొత్తంగా 64,012 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు తెలిపారు. ఎగువన సాగర్ నుంచి 83,491 క్యూసెక్కులు వస్తుందని తెలిపారు. బుధవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 2 యూనిట్ల ద్వారా 1.0224 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి అయ్యిందని, రిజర్వాయర్‌లో 75.47 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.059 టీఎంసీలకు సమానమన్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 1,11,880 క్యూసెక్కుల వరద నీరు గురువారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 93, 900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 10291, పశ్చిమ డెల్టాకు 7508, గుంటూరు చానల్‌కు 181 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

అనుమతుల్లేని రూ. 97 లక్షల విలువైన సిగరెట్లు స్వాధీనం



సిగరెట్ ప్యాకెట్లను పరిశీలిస్తున్న జీఎస్టీ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

గుంటూరు సిటీ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని హానికరమైన సిగరెట్లను తీసుకొచ్చి.. ఉమ్మడి గుంటూరు జిల్లాలో విక్రయిస్తున్న ముఠా గుట్టును జీఎస్టీ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రట్టు చేశారు. గుంటూరులోని బుడంపాడు రోడ్డులో ఉన్న అన్నపూర్ణ కమర్షియల్ కాంప్లెక్స్ నంబరు 106 గోడౌన్‌పై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. సిగరెట్ గన్నీలను ఇనుము స్క్రాప్ ముసుగులో అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. లారీ డ్రైవర్ గగన్‌కుమార్‌ను అదుపులోనికి తీసుకుని విచారించగా.. ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నంబూరు సుబ్బారావు గుప్తా, సీహెచ్ మురళీకృష్ణ షాపును అద్దె తీసుకొని అనుమతి లేని సిగరెట్లు తీసుకువచ్చి విచ్చలవిడిగా అమ్మకాలు జరుపుతున్నట్లు తేలింది. భువనేశ్వర్‌కు చెందిన కృష్ణా అనే వ్యాపారి నుంచి వీటిని కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ దాడుల్లో జీటీపీఎల్ విమల్ రకానికి చెందిన 1,79,200 ప్యాకెట్లు (విలువ రూ.71.68 లక్షలు), మిడ్ ల్యాండ్ రకానికి చెందిన 6,400 ప్యాకెట్లు (రూ.5.76 లక్షలు), గోల్డ్ విమల్ రకానికి చెందిన 6,400 ప్యాకెట్లు (విలువ రూ.6.40 లక్షలు), గోల్డ్ స్లైప్ రకానికి చెందిన ప్యాకెట్లు 2,400(రూ. 9.60 లక్షలు), గోల్డ్ స్టేజ్ రకానికి చెందిన ప్యాకెట్లు 7,200(రూ.3.60 లక్షలు) స్వాధీనం చేసు కున్నారు. విక్రేతలపై పాత గుంటూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ దాడులలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ కె.శ్రీధర్, విజిలెన్స్ సీఐ కె.చంద్రశేఖర్, ఎఫ్ఆర్ఓ ఎస్కే సైదులు, ఆర్ఐ ఎస్కే కరిముల్లా పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల ఇంటి దొంగ అరెస్టు

● రూ.7 లక్షల విలువ గల సొత్తు స్వాధీనం

బాపట్లరూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లో పగటిపూట ఇంటి దొంగతనాలకు పాల్పడే నిందితుడిని బాపట్ల జిల్లా సీసీఎస్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. అతడి నుంచి సుమారు రూ.7లక్షలకుపైగా విలువైన చోరీసొత్తును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా సీసీఎస్ పోలీసు స్టేషన్ ఆవరణంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్ వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా యడ్లపాడు గ్రామానికి చెందిన కోడిరెక్క విజయ్‌కుమార్ అనే వ్యక్తి సుమారు ఐదేళ్ల నుంచి దొంగతనాలు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో 6 చోట్ల, ఏపీలో రెండు ప్రదేశాలలో మొత్తం 8 చోట్ల దొంగతనాలకు పాల్పడ్డాడని వివరించారు. ఇటీవల అద్దంకి, సంతమాగులూరు, మార్టూరు పోలీసు స్టేషన్ల పరిధిలో పగటిపూట ఇంటి దొంగతనాలు చేశాడని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గురువారం సాయంత్రం అద్దంకి, మేదరమెట్ల బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద సీసీఎస్ పోలీసు అధికారులు నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ అభినందించారు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న సీసీఎస్ డీఎస్పీ పీ జగదీష్ నాయక్

మునుమాక - ముత్తనపల్లి ఎల్‌సీ గేటు మూసివేత

గుంటూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట - ముకుంద రాజుపురం రైల్వేస్టేషన్ల మధ్య ఉన్న ఆర్‌యూబీ నంబరు 279 వద్దనున్న లెవల్ క్రాసింగ్ గేటుని తాత్కాలికంగా మూసి వేస్తున్నట్లు రైల్వే సీనియర్ డీసీఎం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మునుమాక నుంచి ముత్తనపల్లి గ్రామం వెళ్లే రహదారి పునరుద్ధరణ పనులు వర్షాల వల్ల ఆలస్యం కావడంతో గేటుని ఈ నెల 10 నుంచి నవంబరు 9వ తేదీ వరకు 31 రోజుల పాటు మూసి వేయడం జరుగుతుందన్నారు. ప్రత్యామ్నాయంగా ఎల్‌సీ నంబరు 276 రైతు నగర్ మార్గంలో వాహనదారులు ప్రయాణించాలని సూచించారు.

రొయ్య రైతుకు ప్రకృతి విపత్తుల నుంచి భరోసా

● ఏఐసీ, ఏపీజీబీ మధ్యన కుదిరిన ఒప్పందం



ఒప్పందం చేసుకుంటున్న ఏఐసీ, ఏపీజీబీ అధికారులు

గుంటూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రొయ్యల సాగు చేసే రైతులకు ప్రకృతి విపత్తుల నుంచి ఆర్థిక భరోసా కల్పించేందుకు అగ్రికల్చర్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఏఐసీ), ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు(ఏపీజీబీ) మధ్యన ఒప్పందం కుదిరింది. గురువారం సాయంత్రం గుంటూరులోని ఏపీజీబీ కార్యాలయంలో ఎంఓ యూపై రెండు సంస్థల అధికారులు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐసీ జనరల్ మేనేజర్ లలిత్ ఖర్బందా మాట్లాడుతూ భారత దేశంలోని అక్వా కల్చర్ వ్యవస్థని బలోపేతం చేసే దిశగా ఏఐసీ, ఏపీజీబీ ఈ ఒప్పందం చేసుకొన్నాయన్నారు. దీని వలన రొయ్యల రైతులకు సమగ్ర బీమా కవరేజ్, ఆర్థిక రక్షణ కల్పన జరుగుతుందన్నారు. రొయ్యల పెంపకంతో పా టు పశువులకు కూడా ఈ బీమాని విస్తరించేందుకు లక్ష్యంగా పెట్టుకొన్నా మన్నారు. దీని వలన రైతులకు ఆర్థికంగా భరోసా కలుగుతుందని చెప్పారు. రైతులు వ్యవసాయ రుణాలను కాపాడుకోవడానికి కూడా ఈ బీమా వీలు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీ ఏపీ రీజనల్ మేనేజర్ జీజీ రాజు, స్టేట్ బిజినెస్ హెడ్ జె.నితీష్ గౌడ, ఏపీజీబీ చైర్మన్ కె. ప్రమోద్ కుమార్‌రెడ్డి, జనరల్ మేనేజర్లు కె.జనార్దనరావు, ఎ.రాజశేఖరం పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

తెనాలి క్రైం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చౌక బియ్యం తరలిస్తున్న మినీ లారీని వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుర్రిపాలెం రోడ్డులోని పాలాద్రి కాల్వ వద్ద గల లక్ష్మీనగర్ కాలనీలోని చౌకడిపో నుంచి 29 బస్తాల బియ్యాన్ని మినీ లారీలో చుండూరులోని అమృతలూరు కోటేశ్వరరావు రైస్ మిల్లుకు తరలిస్తున్నారు. వన్‌టౌన్ పోలీసులు లారీని బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. బియ్యం తరలిస్తున్న తాడిబోయిన అశోక్, లారీ డ్రైవర్ సందీప్‌ను అరెస్టు చేశారు.

అడిగొప్పుల ఆలయ హుండీ ఆదాయం రూ.50,17,019

దుర్గి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పులలో వేంచేసియున్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం గురువారం లెక్కించారు. 82 రోజులకు గాను రూ. 50,17,019గా వచ్చింది. శ్రీజగన్నాథస్వామి గ్రూపు దేవస్థాన సహాయ కమిషనర్, ఈవో సుభద్ర హుండీ లెక్కింపును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషనాయుడు తదితరులు పాల్గొన్నారు.



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో సుభద్ర

సచివాలయ మహిళా ఉద్యోగిపై వేధింపులు



జాజుల తిరుపతయ్య

యడ్లపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ మహిళా ఉద్యోగిపై వేధింపులకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కారుచోల గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా బాధిత ఉద్యోగిని పనిచేస్తోంది. పశువులకు వైద్యం చేయాలంటూ అదే గ్రామానికి చెందిన జాజుల తిరుపతయ్య అనే వ్యక్తి ఆమెను ఇంటికి పిలిచాడు. పశువులను పరీక్షిస్తుండగా ఒక్కసారిగా తిరుపతయ్య మహిళా ఉద్యోగి చేయి పట్టుకుని లాగాడు. దీనితో భయపడిన ఆమె పెద్దగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని ఆరా తీశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బాధితురాలి ఫిర్యాదు మేరకు.. తిరుపతయ్యను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.

ప్రత్తిపాడులో పట్టపగలు చోరీ

ప్రత్తిపాడు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ప్రత్తిపాడులో పట్టపగలు ఇంట్లో దొంగతనం జరిగింది. బియ్యం డబ్బాలో పెట్టిన 8 సవర్ల బంగారు ఆభరణాలతో పాటు రూ.10 వేల నగదు దోచుకెళ్లారు. ప్రత్తిపాడు పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సెలూన్ నిర్వాహకుడు చేబ్రోలు శ్రీనివాసరావు, ఆయన తల్లి ఇద్దరూ ఇంట్లో లేని సమయంలో.. ఈ దొంగతనం జరిగింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన శ్రీనివాసరావు తలుపు తీసి ఉండడం గమనించాడు. మంచం వెనుక ఉన్న డబ్బాలో బంగారంతో పాటు డబ్బులు మాయమవడాన్ని గుర్తించి ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో క్లూస్ టీం వచ్చి వేలి ముద్రలు సేకరించారు. ఎస్ఐ నరహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లెక్సీ వివాదంలో 50 మందిపై కేసు నమోదు

ప్రత్తిపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): యనమదలలో ఎన్టీఆర్ ఫ్లెక్సీ వివాదంలో జరిగిన కొట్లాటలో.. ప్రత్తిపాడు పోలీసులు ఇరు వర్గాలపై కేసు నమోదు చేశారు. గ్రామంలో అలజడి సృష్టించిన నేపథ్యంలో ఇరు వర్గాలకు చెందిన 50 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరహరి తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

గుట్కా, గంజాయిలకు బ్రాండ్ అంబాసిడర్ ముస్తఫా కుటుంబం


కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): గుట్కా, గంజాయి అమ్మకాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా ముస్తఫా కుటుంబం ఉందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఆరోపించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ హయాంలో గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే ముస్తఫా గంజాయి, గుట్కా అక్రమ వ్యాపారం నిర్వహించి యువత భవిష్యత్తును నాశనం చేశారని మండిపడ్డారు. ఈ విషాయాన్ని ఆయన కుమార్తె మర్చిపోతే ఎలా అని ప్రశ్నించారు. ముస్తఫా ఏకంగా తన పొగాకు గోడౌన్‌లోనే గుట్కా పాకెట్లు తయారుచేస్తూ పట్టుబడిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. అప్పటి ఎస్పీ అమ్మిరెడ్డి, ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరిధర్ మధ్య వాటాలు కుదరక అధికారులు దాడులు నిర్వహించిన మాట వాస్తవం కాదా అని ఆయన నిలదీశారు. మద్యం తయారీ కేంద్రాన్ని ప్రభుత్వ అధికారులు గుర్తించి దాడులు చేసి పట్టుకుంటే వైసీపీ నాయకులు హడావుడి చేయడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రంలోని అన్ని డిస్టలరీలు, బేవరేజీలను ఆక్రమించి శుద్ధి చేయని స్పిరిట్‌కు కేరామిల్ రంగులు కలిపి పేదవాడి రక్తం తాగింది జగన్ రెడ్డి కాదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ సమావేశాలన్నీ రాజమండ్రి కేంద్ర కారాగారంలో నిర్వహించుకునే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

అక్రమ కట్టడాలను ఉపేక్షించబోం

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అనధికార కట్టడాలను, లే అవుట్లను ఉపేక్షించబోమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. ఎక్కడైనా అనధికార నిర్మాణాలు జరిగితే ప్రజలు నేరుగా తన పర్యవేక్షణలో ఉండే 9849908391 నంబర్‌కు వాట్సప్ ద్వారా తగిన ఆధారాలతో ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు. గుంటూరు నగరంలో నిర్మాణాలు జీఎంసీ నుంచి నిర్దేశిత అనుమతులు పొందిన తర్వాతే చేపట్టాలని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తే కూల్చివేయడంతో పాటు నిర్మాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అలాగే బాధ్యులైన సిబ్బంది, అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగర ప్రజలు నిర్మాణ, లే అవుట్ల అనుమతుల కోసం దరఖాస్తు చేస్తే నిర్దేశిత గడువు లోపు మంజూరుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులకు నగదు రహిత చికిత్సను అందించాలి

● జేసీకి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం వినతి


శ్రీవాస్తవకు వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘ సభ్యులు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత చికిత్సను అందించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జేసీ అశుతోష్ శ్రీవాస్తవకు ఆయన వినతి పత్రం అందజేశారు. నెట్‌వర్క్ ఆస్పత్రులలో పూర్తిస్థాయిలో నగదు రహిత చికిత్సలు అందడం లేదని జేసీ దృష్టికి తీసుకువచ్చారు. ఆస్పత్రుల యాజమాన్యంతో సమావేశం నిర్వహించి పూర్తిస్థాయిలో చికిత్సలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘ సభ్యులు లక్ష్మీనారాయణ, సుమిత్రా దేవి, కోటాసాహేబ్, వి కార్తీక్, ఈశ్వర్ ప్రసాదు, శ్రీనివాస్, రమణి, మయూరి తదితరులు ఉన్నారు.

అథ్లెటిక్స్‌లో ఎస్‌కేఎస్‌ఎం విద్యార్థుల సత్తా


పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

గుంటూరు(విద్య), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో కొత్తపేటలోని కాసు సాయమ్మ మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారని హెచ్‌ఎం జిలాని భాష గురువారం తెలిపారు. అండర్-17 వంద మీటర్ల పరుగులో బాలికలు ద్వితీయ స్థానం సాధించారని, 200 మీటర్ల పరుగులో రెండో స్థానంలో నిలిచారని తెలిపారు. 1500 మీటర్ల పరుగులో ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కాయని తెలిపారు. అండర్ 17 బాలికల లాంగ్ జంప్, 1500 మీటర్ల పరుగులో బాలురు తృతీయ స్థానం సాధించారని వివరించారు విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు కె. విజయకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

రోల్ మోడల్‌గా గుంటూరును అభివృద్ధి చేస్తాం..!

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్ర


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మేయర్ రవీంద్ర

గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరాన్ని అభివృద్ధిలో రాష్ట్రానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని) అన్నారు. నియోజకవర్గంలోని 25వ డివిజన్‌లో రూ.1.80 కోట్ల అభివృద్ధి పనులకు గురువారం వారిరువురూ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ, 25వ డివిజన్ నగరానికి శివారుగా ఉండి, చాలా కాలంగా అభివృద్ధికి దూరంగా ఉందని అన్నారు. ఈ ప్రాంతంలో పైపులైన్‌లు వేసి, డ్రెయిన్‌లు నిర్మించి, సీసీ రోడ్లు వేసే పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గంలో అన్ని అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఆమె టీడీపీ నేత గళ్ళా రామచంద్రరావుతో కలిసి శ్రీగిరి నాగమాంబ వర్ధంతి, విశ్వకర్మ హోమంలో పాల్గొన్నారు. శ్రీ ఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో ఈ హోమం జరిగింది. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తిరువళ్ళూరు పద్మావతి పాల్గొన్నారు.

బడుగుల ఆరోగ్యానికి బాసట సీఎంఆర్‌ఎఫ్

అనారోగ్యంతో బాధపడే పేద, బడుగు బలహీనవర్గాలకు సీఎం సహాయ నిధి బాసటగా నిలుస్తోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. నియోజకవర్గంలోని పలువురు అనారోగ్య బాధితుల కుటుంబాలకు గురువారం ఆమె రూ. 10.21లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. తన పాలనలో ఏ ఒక్కరూ బాధపడకూడదన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి సీఎం సహాయ నిధి ద్వారా పేదలను ఆదుకుంటున్నారని ఆమె ఈ సందర్భంగా తెలిపారు.

పతాక స్థాయికి జగన్ పిచ్చి

● ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ



గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం పర్యటనలో ప్రజాసంఘాల నుంచి నిరసన వ్యక్తమవడంతో జగన్‌లోని పిచ్చి పతాకస్థాయికి చేరిందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఎద్దేవా చేశారు. జగన్ చేపట్టిన నర్సీపట్నం పర్యటన నవ్వుల పాలైందన్నారు. ఉత్తరాంధ్రను సర్వనాశనం చేసింది చాలక, ఇప్పుడు చలో నర్సీపట్నం అంటూ వెళ్లిన జగన్‌కు మరోసారి భంగపాటు తప్పలేదన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో గురువారం మోహనకృష్ణ విలేకరులతో మాట్లాడారు. తాను అడుగు బయటపెడితే చాలు తండోపతండాలుగా జనం తరలివస్తారనే భ్రమలో జగన్ ఉంటారని చెప్పారు. నర్సీపట్నంలో జగన్‌రెడ్డికి ప్రజల నుంచే కాదు ఆ పార్టీ క్యాడర్ నుంచి కూడా సహకారం కరువైందన్నారు. తన పర్యటనను విజయవంతం చేయకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిక్కెట్లు ఇచ్చేదే లేదని విశాఖ కార్పొరేటర్లకు టార్గెట్ పెట్టినా వారు పెద్దగా స్పందించలేదన్నారు. చలో నర్సీపట్నం అంటూ వెళ్లిన జగన్‌కు వైసీపీ నెవ్వర్ ఎగైన్ అంటూ ఫ్లెక్సీలతో జనం స్వాగతం పలికారన్నారు. మీ మాటలను జనం విశ్వసించడం లేదని ఇకనైనా ఇలాంటి పర్యటనలు మానుకోవాలని జగన్‌కు మోహనకృష్ణ సూచించారు.

దివ్యాంగుల రిజర్వేషన్లను రెగ్యులర్ కోటాలోనే అమలు చేయాలి

● ప్రపంచ అంధుల సంఘం అధ్యక్షుడు సంతోష్ కుమార్ రుంగ్టా



మాట్లాడుతున్న ప్రపంచ అంధుల సంఘం అధ్యక్షుడు సంతోష్ కుమార్ రుంగ్టా

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో దివ్యాంగులకు అమలు చేస్తున్న నాలుగు శాతం రిజర్వేషన్లను ప్రతి క్యాటగిరీలో సమాంతరంగా కాకుండా మొత్తం మీద నాలుగు శాతం అమలయ్యేలా చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, ప్రపంచ అంధుల సంఘం అధ్యక్షుడు సంతోష్ కుమార్ రుంగ్టా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాత సహాయకులతో అంధులు దశాబ్దాల నుంచి పోటీ పరీక్షలకు హాజరవుతుండగా నేడు సాంకేతిక నైపుణ్యాన్ని, కంప్యూటర్లను వినియోగించి వారిని స్వయంగా పరీక్షలు రాయాలనడం భావ్యం కాదని అన్నారు. అంధులు కంప్యూటర్ పరిజ్ఞానం, సాంకేతికత అందిపుచ్చుకునే వరకు రాత సహాయకులను కొనసాగించాలని కోరారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ, పబ్బరాజు వేంకటేశ్వర రావు, రాజ్యలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ స్మారక మానవ సేవా జాతీయ పురస్కారం అందుకుంటున్న సంతోష్ కుమార్ అంధుల జీవితాలలో వెలుగులు నింపేందుకు మూడు దశాబ్దాలుగా అవిరళ కృషి జరిపారన్నారు. ఆయన చేసిన కృషి ఫలితంగా 2016 నుంచి భారత పార్లమెంటు దివ్యాంగుల చట్టాన్ని ఆమోదించి అమలు చేస్తోందన్నారు. ఏఎన్‌యూ పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రంగయ్య మాట్లాడుతూ, ఈ నెల 10న గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో జరిగే పబ్బరాజు వేంకటేశ్వర రావు, రాజ్యలక్ష్మి స్మారక మానవ సేవా జాతీయ పురస్కార కార్యక్రమానికి సేవా తత్పరులందరూ హాజరుకావాలని కోరారు. పబ్బరాజు వేంకటేశ్వర రావు, రాజ్యలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ చైర్ పర్సన్ అనంగి పూర్ణచంద్ర రావు మాట్లాడుతూ, మూడు దశాబ్దాలుగా షిర్డీ సాయి దీన జన సేవా సమితి అంధుల జీవితాలలో మార్పులు తెచ్చేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్ పర్సన్ ఉప్పలపాటి మధుసూదన రావు, జన చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి హేయం

● కూటమి నేతల ఆగ్రహం
● లాడ్జిసెంటర్లో ఆందోళన.. అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం


లాడ్జి సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కూటమి నేతలు

గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ విగ్రహంపై దాడి హేయమైన చర్య అని తెలుగుదేశం పార్టీ కూటమి దళిత నాయకులు అన్నారు. అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయడమంటే రాజ్యాంగంపై చేసినట్లేనని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లాలో వైసీపీ నేతలు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని ఖండిస్తూ లాడ్జి సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి అనంతరం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ, రాజకీయాలలో వైసీపీ హీనమైన కుట్రలకు తెరలేపిందని మండిపడ్డారు. అంబేడ్కర్ విగ్రహాన్ని వైసీపీ నేతలే తగలబెట్టి కూటమి ప్రభుత్వంపై కుట్రలు చేస్తోందన్నారు. అంబేడ్కర్ ఒక కులానికి చెందిన నేత కాదని, ఆయనపై రాజకీయ కుట్రలకు తెరలేపడం సరికాదని అన్నారు. దళిత వ్యతిరేక వైసీపీ చర్యలను ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, ఏపీ లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, మానుకొండ శివప్రసాద్, కనపర్తి శ్రీనివాసరావు, గుడిమెట్ల దయారత్నం, సొపాటి రత్నం, లక్ష్మీ శైలజా గౌడ్, కొమ్మినేని కోటేశ్వరరావు, యర్రగోపు నాగేశ్వరరావు, పుల్లా సుందరం బాబు, యనమల ప్రకాష్, వకుళా దేవి తదితరులు పాల్గొన్నారు.

మోయక తప్పదు బతుకు భారం



నెత్తిపై మూటలతో ఓ తల్లి తన ఇద్దరు పిల్లలతో వెళ్తూ గుంటూరు పట్టణంలోని ఓ రోడ్డులో కనిపించింది. బతుకు భారం ఎలా మోయాలో తన పిల్లలకు ఇప్పటినుంచే నేర్పిస్తూ తనతో పాటు తీసుకెళ్తోంది.

నియోజకవర్గాల్లో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ఎగ్జిబిషన్‌లు

● జాయింట్ కలెక్టర్ శ్రీవాస్తవ

గుంటూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ స్థాయిలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ (ఎస్‌జీఎస్‌ఎస్) కార్యక్రమంపై సంబంధిత అధికారులతో గురువారం ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 10,11వ తేదీల్లో ఏసీ కళాశాలలో జీఎస్టీ తగ్గింపు ధరలపై ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీని ద్వారా తగ్గిన ధరలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని అన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల వివిధ రంగాల్లోని వస్తువులపై తగ్గిన పన్నుల శాతం గురించి ప్రజలకు అవగాహన కల్పించటానికి జిల్లాలో విస్తృత స్థాయిలో కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గం స్థాయిలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ పెద్ద ఎత్తున ఎగ్జిబిషన్-సేల్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎగ్జిబిషన్లో చిన్న పిల్లల పుస్తకాలు, నోట్ బుక్స్ గ్రాఫ్‌లు, పెన్సిళ్లు, రబ్బర్లు, పెన్నులు, గృహోపకరణాలు, టీవీలు, ఏసీలు, ఫ్రిజ్‌లు, ఫోన్లు, స్కూటర్లు, బైక్లు, కార్లు, ఇతర వాహనాలు తగ్గించిన రేట్లతో పాటు దీపావళి ఆఫర్లతో అతి తక్కువ ధరలకు విక్రయించడం వల్ల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ప్రజలందరూ వచ్చేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఎగ్జిబిషన్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు జేసీ సూచించారు.

నూతన భవన సముదాయానికి రూ.6 లక్షల విరాళం


గట్టినేని రంగారావును సత్కరిస్తున్న కమ్మ జన సేవా సమితి సభ్యులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జేకేసీ కళాశాల రోడ్డులోని కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ. 6 లక్షలను ఆంధ్ర బ్యాంకు విశ్రాంత ఉద్యోగి గట్టినేని రంగారావు ప్రకటించారు. గురువారం బృందావన్‌గార్డెన్స్‌లో బాలికల వసతి గృహంలో కమ్మజనసేవ సమితి అధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి, కార్యదర్శి కన్నెగంటి బుచ్చయ్య చౌదరికి ఈ చెక్కును అందజేశారు ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ, రంగారావు జీవిత భాగస్వామి పారిజాతం గతంలో నూతన భవనానికి రూ. 3లక్షల విరాళాన్ని అందించారని గుర్తు చేసుకున్నారు. అంతేగాక ప్రతి ఏడాది ఒక విద్యార్థికి వసతి గృహ ఫీజు కింద రూ. 25 వేలను ఇస్తున్నారని తెలిపారు. అనంతరం గట్టినేని రంగారావును సమితి సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమితి గౌరవ అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు చుక్కపల్లి రమేష్, గౌరవ సలహాదారు వంకాలపాటి బలరామకృష్ణయ్య, కావూరి రవిచంద్ర, రాయపాటి గోపాలకృష్ణ, డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాదు, కరణం పట్టాభిసీతారామయ్య, మల్రిపూడి సీతారామయ్య, పెద్ది సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ అభివృద్ధికి సహకరించండి

● సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే నసీర్ వినతి


సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలు అత్యధికంగా ఉన్న గుంటూరు తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ విన్నవించారు. వెలగపూడిలో గురువారం ఆయన సీఎం చంద్రబాబును కలిశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని విభాగాలలోనూ అభివృద్ధికి సహకరిస్తున్నందుకు సీఎంకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. గుంటూరు నగరంలోని ఆటోనగర్ ప్రాంతం గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రతి రోజూ సుమారు 30 వేల మంది కార్మికులు పని చేస్తుంటారని, వందల సంఖ్యలో వ్యాపారులు ఉన్నారని వివరించారు. అక్కడ కనీస మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ నేపథ్యంలో ఆ ప్రాంత రూపురేఖలు మార్చేందుకు సహకారం అందించాలని విన్నవించారు. నియోజకవర్గంలో ఉన్న వెనుకబడిన కాలనీల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ సీఎంకు వివరించారు.

● డ్రెయిన్ల నిర్మాణానికి పటిష్ట ప్రణాళిక ఉండాలి

డ్రెయిన్ల నిర్మాణంలో పటిష్ట ప్రణాళిక అవసరమని, దీనికి సంబంధించి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్థానిక తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు నగరంలోని నాజ్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు డ్రెయిన్ల నిర్మాణానికి అవసరమైన ప్రణాళికల గురించి అడిగి తెలుసుకున్నారు. డ్రెయిన్ల నిర్మాణంలో ఎదురయ్యే ఇబ్బందులు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్ మ్యాప్ తయారు చేయాలని సూచించారు. డ్రెయిన్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

యువత వికసిత్ భారత్ వైపు పయనించాలి


మాట్లాడుతున్న దర్శనపు శ్రీనివాస్, పాల్గొన్న చెరుకూరి తిరుపతిరావు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ వైపు యువత పయనించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ అన్నారు. బ్రాడీపేటలోని ఆయన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని, స్వభాషపై అభిమానం ఏర్పరచుకోవాలని సూచించారు. విద్య, ఉద్యోగాలకు విదేశాలపై ఆధారపడకుండా, మన దేశంలో ఉన్న వనరులను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ, జిల్లాలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వికసిత్ భారత్ పేరుతో పెద్ద ఎత్తున యువతతో కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

విశ్రాంత ఎస్పీ గోపాలరావుకు కన్నీటి నివాళులు

గుంటూరు, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఎస్పీ ఎన్.గోపాలరావు (87) డొంకరోడ్డులోని తన నివాసంలో గురువారం తుదిశ్వాస విడిచారు. గోపాలరావు భౌతికకాయానికి పోలీసు అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. 1961లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పోలీసుశాఖలో చేరిన గోపాలరావు, ఎస్ఐ, సీఐ, డీఎస్పీ, అదనపు ఎస్పీగా గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, ఏలూరు జిల్లాలలో విధులు నిర్వహించారు. గోపాలరావుకు భార్య, నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విశ్రాంత ఎస్పీ మృతికి ఆంధ్రప్రదేశ్ విశ్రాంత పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు, విశ్రాంత డీజీపీ మాలకొండయ్య, గౌరవాధ్యక్షులు విశ్రాంత ఐజీ సీఆర్ నాయుడు, వైస్‌ప్రెసిడెంట్ ఏ రవిచంద్ర, జనరల్ సెక్రటరీ కాళహస్తి సత్యనారాయణ, కోశాధికారి డాక్టర్ కేవీ నారాయణ, అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ ఎం.రంగప్రసాద్ తదితరులు నివాళులర్పించారు. ఆయన అంత్యక్రియలు ముగిశాయి. కుటుంబసభ్యులు, అధికారులు, ప్రజలు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు.

కాన్షీరామ్‌కు ఘనంగా నివాళి


కాన్షీరామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

బహుజన సమాజ్ పార్టీ స్థాపకుడు కాన్షీరామ్ జయంతి సందర్భంగా ఆ పార్టీ జిల్లా నేతలు గురువారం స్థానిక ఏసీ కళాశాల వద్ద ఉన్న కాన్షీరామ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దళిత, బహుజనుల ఆత్మగౌరవం కాపాడిన, బహుముఖ మేధావి కాన్షీరామ్ అని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తెనాలి ప్రకాశ్ కొనియాడారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కూరపాటి సుబ్బారావు, వాసు, యాతాటి కిషోర్, మణి కుమారి, మన్నేపల్లి శ్యామ్, కొల్లిపర ప్రసాద్, డా మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

గృహహింస కేసులో ముగ్గురు నిందితులకు ఏడాది జైలు... జరిమానా

గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గృహహింస కేసులో ముగ్గురు నిందితులకు ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. పెదకాకాని పోలీసుస్టేషన్ పరిధిలోని నంబూరు గ్రామానికి చెందిన తాడిబోయిన సుమలత(24) భర్త తాడిబోయిన వీరాంజనేయులు, మామ తాడిబోయిన శివరామయ్య, అత్త శివమ్మ అదనపు కట్నం కోసం తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారంటూ 2019లో పెదకాకాని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు నమోదు చేసుకొని సమగ్రంగా దర్యాప్తు నిర్వహించి నిందితులను కోర్టులో హాజరు పరిచారు. విచారించిన కోర్టు గృహహింస నిజమేనని తేలడంతో వారికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించింది.

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు వేతనాలు విడుదల చేయాలి



ఆర్‌వైఎస్‌ఎస్ సీఈవో రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలను విడుదల చేయాలని ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఏ శ్రీధర్, వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు గోరంట్లలోని రైతు సాధికారత సంస్థ (ఆర్‌వైఎస్‌ఎస్) సీఈవో రామారావుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ, పది నెలలుగా జీతాలందక సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మౌలికవసతులు లేకున్నా ప్రకృతి వ్యవసాయ పథకాన్ని గ్రామీణప్రాంతాల్లో ముందుకు నడిపిస్తున్న సిబ్బందికి ప్రభుత్వం సదుపాయాలు కల్పించాలన్నారు. విజయనగరంలో తొలగించిన ఏపీసీఎన్ఎఫ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సిబ్బందికి ప్రభుత్వ గుర్తింపుకార్డు మంజూరుచేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వినతిపత్రం అందజేసినవారిలో జ్యోతి, రాజు, శ్రీను తదితరులు ఉన్నారు.

వస్తు తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

● లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ అల్లూరయ్య

గుంటూరు (తూర్పు), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వస్తు తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ అల్లూరయ్య సూచించారు. గురువారం పాత గుంటూరు రైతు బజార్లో జాతీయ వినియోగదారుల సమాఖ్య ఉపాధ్యక్షుడు డాక్టర్ చదలవాడ హరిబాబు ఆధ్యక్షతన ప్రపంచ స్టాండర్డ్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరయ్య మాట్లాడుతూ, బంగారం ధర పెరగడంతో తూకం విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నల్లపూసల గొలుసుల్లో బంగారం, నల్లపూసలు విడివిడిగా తూకం వచ్చేలా రశీదు పొందాలన్నారు. ప్రతి మొబైల్ ఫోనులో బీఐఎస్ వారి యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. లీగల్ మెట్రాలజీ తనిఖీ అధికారి సునీల్‌కుమార్ మాట్లాడుతూ, రైతు బజార్లో జీఎస్టీ తగ్గింపు ధరలను అమలు చేయాలన్నారు. అర లీటరు వాటర్ బాటిల్‌ను రూ. 9కే విక్రయించాలన్నారు. ఈ సందర్భంగా బాటిల్‌ను రూ. 10కి విక్రయిస్తున్న దుకాణదారునికి అధికారులు రూ.10వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో వ్యాపారులు, అధికారులు, వినియోగదారుల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.


రైతు బజార్లో వ్యాపారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కంట్రోలర్ అల్లూరయ్య

ప్రేమించిన యువతిని మర్చిపోలేక నవ వరుడి ఆత్మహత్య

గుంటూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువతిని మర్చిపోలేక ఓ నవవరుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధి దాసరిపాలెంలో జరిగింది. దాసరిపాలేనికి చెందిన చంటి కూలిపనులు చేస్తుంటాడు. అతడు ఓ యువతిని ప్రేమించాడు. ఈ ఏడాది ఆగస్టు 28న మరో యువతితో అతడికి వివాహమైంది. వివాహమైన వారానికే చంటి తన చేయి కోసుకొని, ఎలుకలు మందు తిని ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే జీజీహెచ్‌కు తరలించి చికిత్స చేయించారు. అలా ఎందుకు చేశావని కుటుంబసభ్యులు అడగ్గా తాను పెళ్ళికి ముందే ఓ యువతిని ప్రేమించానని, ఆమె గుర్తుకురావడంతో అలా చేశానని చెప్పాడు. పెద్దలు సర్దిచెప్పి తీసుకెళ్లారు. గురువారం తాను ప్రేమించిన యువతి మరలా గుర్తొస్తోందని బాధపడుతూ తనకు జ్వరంగా ఉందని టిఫిన్ తెమ్మని భార్యకు చెప్పాడు. ఆమె బయటకెళ్లి ఇంటికి తిరిగొచ్చేసరికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చంటి భార్య ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని బుడంపాడు బైపాస్ అండర్‌పాస్ వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన కుమ్మరిగుంట రత్తయ్య(60) చికిత్సపొందుతూ జీజీహెచ్‌లో మృతి చెందాడు. చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన రత్తయ్య బుడంపాడులోని ఓ తూముల కంపెనీలో పనికి చేరి అక్కడే గదిలో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 6న రాత్రి సమయంలో పెరుగుప్యాకెట్ తెచ్చేందుకు ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లి బుడంపాడు బైపాస్ అండర్‌పాస్ వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. స్థానికులు వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రత్తయ్య గురువారం మృతి చెందాడు. అతడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఏరియా వైద్యశాలలో గర్భిణులు

అమ్మకు రక్తహీనత

- పౌష్టికాహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం
- పుట్టబోయే బిడ్డపై ప్రభావం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు..

సత్తెనపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహార లోపం గర్భిణుల్లో అధికమవుతోంది. ఏరియా వైద్యశాలల్లో పరీక్షలకు వచ్చే గర్భిణులు అధికంగా మైల్డ్ ఎనీమియాతో బాధ పడుతున్నారు. వైద్య పరీక్షలకు వచ్చే 12 శాతం మందిలో మాత్రమే సాధారణ స్థాయి కంటే అధికంగా హిమోగ్లోబిన్ ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఒకటి రెండు శాతం మంది సివియర్ ఎనీమియాతో బాధ పడుతున్నట్లు వెల్లడిస్తున్నారు.

రక్తహీనత నిర్ధారణ ఇలా..

హిమోగ్లోబిన్ పరీక్ష ద్వారా రక్త హీనతను నిర్ధారిస్తారు. హిమోగ్లోబిన్ 11 గ్రాములు ఉంటే సమస్య లేనట్లే. అంతకంటే తక్కువగా ఉంటే రక్త హీనతతో బాధ పడుతున్నట్లు గుర్తించాలి. సివీరియర్ ఎనీమియాతో బాధపడే గర్భిణుల్లో హిమోగ్లోబిన్ శాతం ఏడు గ్రాములు కంటే తక్కువ. ఇది అత్యంత ఇబ్బంది కరం. ఈ తరం గర్భిణీల్లో హిమోగ్లోబిన్ శాతం ఏడు నుంచి 11 గ్రాముల మధ్య ఉంటుంది. దీనినే మైల్డ్ ఎనీమియాగా వైద్యులు చెబుతున్నారు. 60 శాతం మంది గర్భిణులు ఈ సమస్యతో బాధ పడుతున్నారు. గర్భ దాల్చిన తర్వాత తగిన పోషకాహారం తీసుకోక పోవడం వల్ల సమస్య ఉత్పన్నమవుతోంది.

ప్రధాన కారణం

రక్త హీనత బారిన పడటానికి ప్రధాన కారణం పోషకాహార లోపమేనని వైద్యులు చెపుతున్నారు. దీనివల్ల గర్భిణుల్లో అలసట, కళ్ల పాలి పోవటం, ఆయాసం, గుండె దడ వంటి లక్షణాలు కన్పిస్తాయి.

పోషకాహారంతో మేలు



పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్త హీనత సమస్యకు చెక్ పెట్టవచ్చు. ప్రతి రోజు ఆహారంలో ఆకు కూరలు, మాంసం, డ్రైఫ్రూట్స్, పండ్లు తీసుకోవాలి. బెల్లం, చిక్కీలు వంటివి తీసుకోవటం ద్వారా కూడా రక్త హీనతకు గురికారు. వైద్యశాలలకు వచ్చే గర్భిణుల్లో రక్త హీనతతో బాధపడే వారికి ఐరన్ టాబ్లెట్స్, ఐరన్ శుక్రోజ్ ఇంజక్షన్‌లు అందిస్తున్నాం.

-డాక్టర్ సుజాత, గైనకాలజిస్టు, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి

ప్రసవ సమయంలో ఇబ్బందులు



హిమో గ్లోబిన్ ఏడు గ్రాముల కంటే తక్కువగా ఉన్న గర్భిణులకు ప్రసవ సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయి. పుట్టబోయే బిడ్డ బరువు, పెరుగుదల తక్కువగా ఉంటుంది. ఐరన్ లోపంతో బాధ పడే గర్భిణులకు ఐరన్ శుక్రోజ్ ఇంజక్షన్‌లు చేస్తున్నాం. ఐరన్ టాబ్లెట్లు అందిస్తున్నాం.

-డాక్టర్ లక్ష్మణరావు, సూపరింటెండెంట్, ఏరియా వైద్యశాల సత్తెనపల్లి

ముందు జాగ్రత్తలు అవసరం



గర్భిణుల్లో రక్తహీనతతో బాధ పడుతున్న వారి సంఖ్య పెరుగుతుంది. పోషకాహారం తీసుకోక పోవటం వల్ల ప్రతి పది మంది గర్భిణుల్లో ముగ్గురు రక్తహీనతతో బాధ పడుతున్నారు. రక్తహీనత సమస్య నివారణకు ముందస్తు చర్యలే మార్గం. పది నుంచి 19 ఏళ్ల లోపు బాలికల్లో రక్తహీనత నిర్ధారణ పరీక్షలు చేయాలి. అవసరమైన పోషకాహారం తీసుకోవడం వల్ల వివాహ సమయానికి ఇబ్బందులు లేకుండా ఉంటుంది.

- డాక్టర్ అరుణ, గైనకాలజిస్టు, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి



గుంటూరు పూల మార్కెట్‌లో ఆరు బయట పార బోసిన బంతి, చేమంతి పూలు

పుష్ప విలాపం!

దసరా అనంతరం పూల ధరలు పతనం

కిలో బంతి రూ.10, చేమంతి రూ.20

గుంటూరు సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నిన్న మొన్నటి వరకు ఆకాశాన్నంటిన పూల ధరలు ఒక్కసారి ఢమాల్ అన్నాయి. పండుగ సీజన్ కిలో బంతి పూల ధర రూ.100 నుంచి రూ.120 వరకు పలికింది. గురువారం అదే బంతి పూలు కిలో రూ. 10 చొప్పున గుంటూరు బస్టాండ్ సమీపంలోని పూల మార్కెట్‌లో విక్రయించారు. పండుగ సమయంలో కిలో రూ.300 వరకు పలికిన చేమంతి ధర రూ. 50 నుంచి రూ.20కి పడిపోయింది. అంత తగ్గించి అమ్మినా కొనేవారు లేకపోవడంతో క్వింటాళ్ల కొద్దీ పూలను ఆరుబయట పారబోస్తున్నారు. చామంతి పూలను ఎక్కువగా బెంగళూరు నుంచి తెప్పించి ఇక్కడ విక్రయిస్తున్నారు. బంతి పూల సాగు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఎక్కువగా ఉంది. ప్రస్తుతం గుంటూరు పూల మార్కెట్‌లో విక్రయించే బంతి పూలు స్థానికంగా దొరికేవి. ఒక్కసారిగా పూల ధరలు పాతాళానికి పడిపోవడంతో.. వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు.



బంధిఖానాలో బాల్యం



గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఐదో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం రాష్ట్రంలోని 20 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న యువతుల్లో 29.3 శాతం మంది బాల్య వివాహాలు చేసుకుంటున్నారని తేలింది. ఇది జాతీ య సగటు 23 శాతం కంటే 6 శాతం అధికం. బాల్య వివాహం చేసుకున్న గ్రామీణ మహిళలు 32.9 శాతం ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 21.7 శాతం మంది ఉన్నారు. వీరిలో 12.6 శాతం మంది 15 నుంచి 19 ఏళ్లలోపే గర్భం దాల్చారు.

జిల్లాల పునర్విభజన తర్వాత

- జిల్లాల పునర్విభజన తర్వాత ఒక్క గుంటూరు జిల్లాలోనే 2022లో 32, 2023లో 30 కేసులు నమోద య్యాయి. 2024లో 29 బాల్య వివాహాలు నమోదవగా వాటిలో 23 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. 2025లో గడిచిన తొమ్మిది నెలల్లో 20 కేసులు రిపోర్టవగా 16 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు.
- పల్నాడు జిల్లాలో 2022, 2023లో 21, 2022లో 12, 2023లో 24, 2024లో 28, 2025లో ఇప్పటి వరకూ 20కి పైగా బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు.
- బాపట్ల జిల్లాలో ఇప్పటి వరకు 29 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. కాగా, 2024, 2025లో 58 బాల్య వివాహాలను అధికారులు ఆపగలిగారు. ఇది అధికారులు అడ్డుకున్న బాల్య వివాహాల లెక్క మాత్ర మే. అయితే క్షేత్ర స్థాయిలో ఈ సంఖ్య పదుల రెట్లు ఎక్కువగా ఉంటోందన్నది జగమెరిగిన సత్యం.

ఫిర్యాదు చేస్తేనే..

ఏదో ఒక వివాదం జరిగి, ఎవరైనా ఉద్దేశ పూర్వకంగా ఫిర్యాదు చేస్తే తప్ప బాల్య వివాహాల విషయం అధికారుల వరకూ రావడం లేదన్నది వాస్తవం. ఏది ఏమైనప్పటికీ గడిచిన నాలుగేళ్లలో బాల్య వివాహాల దురాచారం విపరీ తంగా పెరిగింది. గ్రామీణ ప్రాంతాల విషయం ఎలా ఉన్నా, పట్టణ ప్రాంతాల్లోనే ఈ మహమ్మారి జడలు విప్పి- కోరలు చాచి చిన్నారుల జీవితాలను వివాహ బంధనాల్లోకి లాగేయడం తిరోగమన సంకేతాలు ఇస్తోంది.

వివిధ స్థాయిల్లో కమిటీలు..

బాల్య వివాహాలను అడ్డుకునేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో డివిజన్ అధికారి, సబ్ కలెక్టర్లు బాల్య వివాహ నిరోధక అధికారులుగా వ్యవహరిస్తారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సీడీపీవో ప్రాజెక్టు స్థాయిలో 3 నుంచి 5 మండలాలకు ఒక బాలల అభివృద్ధి ప్రాజెక్టు అధికారి, మండల స్థాయిలో సంబంధిత తహసీల్దార్ పనిచేస్తారు. గ్రామాల్లో సర్పంచి, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, స్థానిక ఉపాధ్యాయురాలు, మహిళా వార్డు మెంబర్లు, స్వచ్ఛంద సంస్థ, యువజన సమాఖ్య సభ్యుడు, ఆరోగ్య, అంగన్వాడీ కార్యకర్తలు బాల్య వివాహ నిరోధక కమిటీలో సభ్యులుగా ఉంటారు. వీరంతా బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను ఆయా ప్రాంతాల్లో తెలియజేస్తూ.. తల్లిదండ్రుల్లో అవగా హన పెంచుతారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగు తుంటే అడ్డుకుంటారు. ఈ కమిటీలు నామమాత్రంగా మారిన కారణంగానే బాల్య వివాహాల సంఖ్య ఇటీవల ఆందోళనకర స్థాయిలో పెరుగుతోంది. బాల్య వివాహాలపై ఐసీడీఎస్ కృషి చేస్తున్నప్పటికీ అది ఏమాత్రం సరిపోవడం లేదన్నది గణాంకాల ద్వారా వెలికి తెలుస్తున్న వాస్తవం!

భయమే కారణమా?

గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరగడానికి కారణం అవిద్య, అవగాహనాలేమి కారణాలుగా కనిపిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లోని తల్లిదండ్రుల సమస్య వేరేలా ఉంటోంది. సినిమా, టీవీల దుష్ప్రభావాలు, లైంగిక వేధింపులు, అత్యాచారాల నుంచి బయట పడేందుకు తక్కువ వయసులో పెళ్లిళ్లకు పూనుకుంటున్నారు. సమాజాన్ని ఆవరించిన అభద్రతా భావం ఆడపిల్లలకు శాపంగా మారింది. ప్రజల్లో అవగాహన పెంచి, భయం పోగొట్టి, మహిళలకు, ఆడపిల్లల భద్రతకు భరోసా ఇచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకుంటే తప్ప ఈ బాల్య వివాహాలు అడ్డుకోవడం కష్టమని నిపుణులు చెబుతున్నారు.

బాల్య వివాహాలతో నష్టాలెన్నో..

- శారీరక, మానసిక ఎదుగుదల దెబ్బతింటుంది.
- పరిపూర్ణ వ్యక్తులుగా ఎదిగేందుకు అవకాశం, స్వేచ్ఛ ఉండదు.
- చిన్న వయసులోనే గర్భధారణ తల్లీబిడ్డకు ప్రమాదం.
- తక్కువ బరువుతో శిశు జననం , పౌష్టికాహార లోపం, రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయి.
- బాలికా విద్యా హక్కును ఇది కాలరాస్తుంది. పిల్లలు నిరక్షరాస్యులుగా, నైపుణ్యం లేనివారుగా మిగిలిపోతారు.



బస్సుకి బలమిచ్చిన..స్త్రీశక్తి!

- మరమ్మతులకు ముందస్తు చర్యలు
- గ్యారేజ్‌లలో అందుబాటులో పరికరాలు
- గతంలో రోజుకు మూడు సర్వీసులు బ్రేక్‌డౌన్
- నేడు అడపాదడపా మాత్రమే..

గుంటూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): డొక్కు బస్సులు, పెద్ద శబ్దాలతో ప్రయాణికులను సైతం ఇబ్బందులకు గురిచేసే బస్సులు, బస్సులకు మరమ్మతులు చేయాలన్నా గ్యారేజ్ సిబ్బందికీ తలకు మించిన భారం ఇదంతా గతంలో ఆర్టీసీ ఎదుర్కొన్న పరిస్థితి. ప్రస్తుతం ఆర్టీసీ గ్యారేజ్‌లలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం ఆర్టీసీకి కూడా దన్నుగా నిలుస్తోంది. స్త్రీ శక్తి పథకం అమలుతో ఆర్టీసీ గ్యారేజ్‌లలో కూడా పరిస్థితులు మెరుగుపడ్డాయి. ఎప్పటికప్పుడు బస్సులకు కావాల్సిన పరికరాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఇప్పటికే డిపోల్లో నిబంధనలకు అనుగుణంగా తిరిగిన స్క్రాబ్ చే స్తున్నారు. బస్సులను తొలగించి వాటి స్థానంలో కొత్తగా ఎలక్ట్రికల్ బస్సులను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉంటే గతంలో బస్సులు మార్గ మధ్యంలో నిలిచిపోవడంతో ప్రయాణికులు రోడ్లపైనే నిల్చొని అదే మార్గంలో వచ్చే వేరొక బస్సు లు ఎక్కాల్సి వచ్చేది. అంతేగాక టైర్లు పంక్చర్‌లు పడటం, బానెట్‌లలో సమస్యలు, ఇంజన్‌లో సాంకేతిక సమస్యలు వచ్చి బస్సులు నిలిచి పోతుండేవి. మరో వైపు గ్యారేజ్‌లలో కూడా గతంలో అవసరమైన పరికరాలు కూడా ఉండేవి కాదు. దీంతో గ్యారేజ్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడేవారు. స్త్రీశక్తి పథకం అమలుతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి.

అడపా దడపానే సమస్యలు

డిపోల్లో గతంతో పోల్చితే బస్సుల్లో సాంకేతిక సమస్యలు, బ్రేక్ డౌన్‌లు రావడం అడపా దడపా ఉంటున్నాయని సిబ్బంది చెబుతున్నారు. అంతేగాక గ్యారేజ్‌లలో అవసరానికి అనుగుణంగా సామగ్రి కూడా అందుబాటులో ఉంచుతున్నారు. స్త్రీ శక్తి పథకం అమలు నేపథ్యంలో ముందుగానే డిపోల్లో బస్సులను పూర్తిగా తనిఖీలు చేసి అందుబాటులో ఉంచుతున్నారు.

స్త్రీశక్తి పథకంపై అలసత్వం చూపొద్దు : ఆర్టీసీ ఈడీ

గుంటూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకంపై ఎవరూ అలసత్వం చూపొద్దని ఆర్టీసీ జోనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈడీ) రాజేంద్రప్రసాద్ సూచించారు. గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్‌లోని తిక్కన సమావేశ మందిరంలో గురువారం డీపీటీవోలు, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా స్త్రీ శక్తి పథకం అమలుపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించదన్నారు. ఈ పథకం అమలుతో ఆర్టీసీలో మహిళల రద్దీ మరింత పెరిగిందన్నారు. మహిళల రద్దీకి అనుగుణంగా ఆయా రూట్లను పరిశీలించి అవసరమైతే ట్రిప్పులను పెంచుకోవాలన్నారు. ప్రయాణి కుల అవసరాలను అనుగుణంగా సర్వీసులు ఏర్పాటు చేయాలని సూచించారు. అలానే బస్టాండ్ ఆవరణలో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదే శాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డిపోల వారీగా ఆదాయ, వ్యయాల వివరాలను సమీక్షించారు. సమావేశంలో డీపీటీవోలు సీహెచ్ విమల (గుంటూ రు), సామ్రాజ్యం (బాపట్ల), అజిత కుమారి (పల్నాడు), జి.సత్యనారాయణ (ఒంగోలు), షేక్ షమీమ్ (నెల్లూరు), డిప్యూటీ సీటీఎం ఎం.రవికాంత్, డిప్యూటీ సీఎంఈ కె.సత్యనారాయణ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ ఈడీ నాగేంద్రప్రసాద్, హాజరైన డీపీటీవోలు

సహాయక చర్యలకు ఎల్లప్పుడూ సంసిద్ధం

- ఎన్‌డీఆర్‌ఎఫ్, సివిల్ డిఫెన్స్ బృందాలు అప్రమత్తం
- మాక్ డ్రిల్‌లో రైల్వే డీఆర్ఎం సుధేష్ణ సేన్

పెదకూరపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదాలు జరిగిన వెంటనే ఎన్‌డీఆర్‌ఎఫ్, సివిల్ డిఫెన్స్ బృందాలు అప్రమత్తమై సహాయక చర్యలు చేపడతాయని సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డివిజన్ డీఆర్ఎం సుదేష్ణసేన్ తెలిపారు. పెదకూరపాడు రైల్వే స్టేషన్‌లో గురువారం ప్రమాదాల సమయంలో సహాయక చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. రైల్వే వ్యాగిన్ పట్టాలు తప్పడం, మంటలు వ్యాప్తి చెందినప్పుడు అదుపు చేసే విధానంపై ప్రతి ఆరు నెలలకోసారి మాక్‌డ్రిల్‌ను నిర్వహిస్తామని డీఆర్ఎం వివరించారు. పట్టాలు తప్పిన కోచ్‌లలో మంటలు చెలరేగినప్పుడు ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకురావడం, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసి, ప్రయాణికులకు తాత్కాలిక వైద్య సేవలు అందించడం, వాణిజ్య శాఖ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రయాణికుల వివరాలను పరిశీలించి బంధువులకు సకాలంలో సమాచారం అందించడం.. వంటివి చేశారు. పట్టాలు తప్పిన కోచ్‌లను మెకానికల్ సీడబ్ల్యూ విభాగం తిరిగి క్రమ పద్ధతిలో అమర్చింది. టెలికమ్యూనిషన్ విభాగం నిరంతర ప్రకటనలతో ప్రజలను, ప్రయాణకులను, సిబ్బందిని అప్రమత్తం చేసింది. ఏఆర్‌టీ, ఎంఆర్‌వీల బృందాలు నిర్ణీత సమయంలోనే అప్రమత్తమై ఘటనా స్థలానికి చేరుకొని ప్రదర్శించిన మాక్ డ్రిల్ విజయవంతమైంది. ఎన్‌డీఆర్‌ఆర్‌ఎఫ్, రాష్ట్ర అగ్నిమాపక సేవలు, రైల్వే విభాగాలతో సహా మాక్‌డ్రిల్‌లో ప్రదర్శించిన పని తీరును డీఆర్ఎం ప్రశంచారు. సీఆర్‌ఎస్‌ఈ కమల్‌కాంత్, డిప్యూటీ సీఎస్‌వో ఎం కిషోర్, సౌత్ సెంట్రల్ సీనియర్ అధికారులు ఈ మాక్ డ్రిల్‌ను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సీఎంఎస్ హెల్త్ యూనిట్ వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, సీనియర్ డీవోఎం శ్రీనాథ్, సీనియర్ డీఈఈ రవితేజ, సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.



గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం తరలిస్తున్న దృశ్యం



ప్రమాదానికి గురైన రైల్వే బోగీ నుంచి గాయపడిన వారిని కిందకు దించుతున్న సిబ్బంది

25 మందితో సీబీఐసీ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

గుంటూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ), ఆంధ్రప్రదేశ్ యూనిట్ 25 మందితో రాష్ట్ర నూతన కార్యవర్గం ఏర్పడింది. గుంటూరులోని రింగ్ రోడ్డు వద్ద ఉన్న కస్టమ్స్, జీఎస్టీ అప్పీల్స్ కార్యాలయంలో గురువారం పెన్షనర్ల సంఘం రాష్ట్రస్థాయి ఎన్నిక, సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి గుంటూరుకు చెందిన టి.వివేకానందను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా విజయవాడకు చెందిన గద్దె తిలక్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం.దేవరాజన్(తిరుపతి), బి. రాజేశ్వరరావు(గుంటూరు), ఎ.సత్యనారాయణ (రాజమండ్రి), పర్వతనేని ప్రసాద్ (విజయవాడ) ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శి పదవికి పీవీ సత్యనారాయణ(గుంటూరు), పి. భీమ్ ప్రసాద్ (ఏలూరు), కేవీ అప్పలాచార్యులు (కాకినాడ), పీవీపీ నరసింహం (వైజాగ్) ఎన్నికయ్యారు. కోశాధికారిగా పి.కోటేశ్వరరావు (గుంటూరు), సీజీహెచ్‌ఎస్ ఏపీ కొ-ఆర్డినేటర్‌గా గుమ్మడి సీతారామయ్య చౌదరి (గుంటూరు), విజయవాడ కో- ఆర్డినేటర్‌గా పి. భాగ్యరావు (విజయవాడ), మహిళా రిప్రెజెంటేటివ్‌గా కె.సాంబ్రాజ్యం (గుంటూరు) పదవులు దక్కించుకున్నారు. సర్కిల్ సెక్రటరీలుగా ఎన్ఎస్ నగేష్‌బాబు, పి.భాగ్యరావు, ఎస్‌కె హుస్సేన్, టి వెంకట్రావు, ఎం.వినోద్ కుమార్, ఇక్రముల్లా షా, ఇనయతుల్లా ఎన్నికయ్యారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా సెంట్రల్ ఎక్సైజ్ శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ సీవీరావు, గౌరవ సలహాదారులుగా విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్లు బి.సీతారామయ్య, పీవీ రమణమూర్తి, నర్రా వెంకటేశ్వర్లును సభ్యులు ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారులుగా జీఎస్టీ సూపరింటెండెంట్లు కేవీ సాగర్, ఎం.గిరిబాబు వ్యవహరించారు. నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు పనిచేస్తుంది. సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజిత్ మల్లిక్, విశ్రాంత చీఫ్ కమిషనర్ బి. హరే రామ్, అఖిల భారత కస్టమ్స్ జీఎస్టీ ఉద్యోగ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.

గుంటూరు రూరల్ వార్తలు

పశ్చిమడెల్టాకు 7,508 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 7,508 క్యూసెక్కుల నీటిని గురువారం విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12 అడుగుల నీటి మట్టం ఉండగా దిగువకు 1,10,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హై లెవెల్ చానల్‌కు 160 క్యూసెక్కులు, రేపల్లె కాల్వకు 1944 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 731 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 210 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 420 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 3,320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల పసుపు మార్కెట్‌యార్డులో 957 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు గురువారం విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9611, గరిష్ఠ ధర రూ.10,600, మోడల్ ధర రూ.10,525 పలికాయి. కాయ కనిష్ఠ ధర రూ.10,525, గరిష్ఠ ధర రూ.10,600, మోడల్ ధర రూ.10,525 పలికాయి.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

దుగ్గిరాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అప్పులు చేసి, పంటలను పండించే కౌలు రైతులకు భూయజమాని అంగీకారంతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డులిచ్చి ఆదుకోవాలని జిల్లా కౌలు రైతు సంఘ కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు అన్నారు. దుగ్గిరాల మండలం చిలువూరులో గురువారం జరిగిన కౌలురైతుల అవగాహన కార్యక్రమంలో మన్నవ మాట్లాడుతూ 80శాతానికిపైగా భూమిలో కౌలు రైతులే ఆరు గాలం శ్రమించి పంటలు పండిస్తున్నారని, అలాంటి వారికి గుర్తింపు కార్డులివ్వకుండా ఈ-పంట నమోదు చేయకుండా అడ్డుకుంటున్నారన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జరీనా

పెదనందిపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎండీ జరీనా అన్నారు. మండల పరిధిలోని పమిడివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణమాస కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులు, గర్భిణులతో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పెరటితోటలో మొక్కలు నాటి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడిని ఖండించాలి : కేవీపీఎస్

తాడేపల్లి టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ప్రజలు, ప్రజాతంత్రవాదులు, అభ్యుదయవాదులు ఖండించాలని కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి కోరారు. గురువారం పట్టణంలోని ప్రకాష్ నగర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కారు నడిపిన వ్యక్తి అరెస్టు

మంగళగిరిసిటీ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం నవులూరులో మంగళవారం మద్యం మత్తులో కారును నడిపి వ్యక్తి మృతికి కారణమైన నిందితుడిని మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూరల్ ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం, నవులూరు గ్రామానికి చెందిన పున్నా శంకరరావు (55) అనే వ్యక్తి ఇంటి బయట నిలబడి ఉన్న సమయంలో గమళ్లపల్లి రాంబాబు అనే ఆటోడ్రైవర్ మద్యం తాగి టాటా మ్యాజిక్ వాహనాన్ని నిర్లక్ష్యంగా నడుపుతూ శంకరరావును ఢీకొట్టాడు. శంకరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితుడైన రాంబాబును అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ వెంకట్ తెలిపారు.

స్కూల్ గేమ్స్‌లో చిర్రావూరు జడ్పీ విద్యార్థుల సత్తా

తాడేపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుమాక జడ్పీ హైస్కూల్లో ఎస్‌జీఎఫ్ గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో చిర్రావూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. డివిజన్ స్థాయిలో అండర్-17 బాలికల విభాగం కబడ్డీలో టి.శ్రావ్య, సీహెచ్ సిరివెన్నెల, ఖోఖోలో యస్ కావ్య, జి.మౌనిక, బాలుర విభాగం ఖోఖోలో కె.శశాంక్, ఎం సంతోష్, వాలీబాల్‌లో పి.వెంకట్, అండర్ 14 బాలికల విభాగం ఖోఖోలో యశస్విని బాలుర విభాగం కబడ్డీలో పి.సాత్విక్, డి.చేతన్, ఖోఖోలో కె.నిఖిల్, అక్షయబాబు, చేతన్, పి.సాత్విక్ ఎంపికయినట్టు పాఠశాల హెచ్ఎం అరుణశ్రీ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను గ్రామ పెద్దలు, ఏఎంసఈ చైర్మన్ ఉపాధ్యాయులు, పీడీ అభినందించారు.

వినూత్న బోధనతోనే ఉత్తమ ఫలితాలు : ఎంఈవో

కాకుమాను, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వినూత్న రీతిలో సులభతర బోధనతోనే ఉత్తమ ఫలితాలు వస్తాయని ఎంఈవో కె.ఎఫ్ కెన్నడీ అన్నారు. స్థానిక మోడల్ ప్రైమరీ ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయిని మన్నెం జ్యోతి ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో గురువారం ఆమెకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఫాతిమా షేక్ వర్ధంతి

దుగ్గిరాల, అక్టోబరు 9: మహిళల్లో చైతన్యం తీసుకువచ్చిన, సంఘసంస్కర్త ఫాతిమా షేక్ 125వ వర్ధంతిని గురువారం ముత్యుజానగర్‌లో ముస్లింలు నిర్వహించారు. తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయిని, సావిత్రి బాయిఫూలే అడుగుజాడల్లో స్త్రీ విద్య కోసం పాటుపడిన ఫాతిమా చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వ ప్రాధాన్యం

● ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ



కరపత్రాలను పంచుతున్న ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, అధికారులు

మంగళగిరి సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆరోగ్యం విషయంలో కూటమి ప్రభుత్వం శ్రద్ధ వహిస్తుందని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. మంగళగిరి పట్టణంలోని కుప్పురావు కాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, రత్నాల చెరువు భావనారుషి స్వామి ఆలయం వద్ద గురువారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ కే.శకుంతల అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కరపత్రాలను పంచి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అనురాధ మాట్లాడుతూ ప్రభుత్వం సాధారణ మందులపై జీఎస్టీని భారీగా తగ్గించిందన్నారు. అలాగే కంటి పరీక్షలు, కళ్లద్దాలు, తదితర పరికరాలపై జీఎస్టీ గణనీయంగా తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, స్వచ్ఛాంధ్ర మిషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మీ, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ పద్మనాభం, టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పడవల మహేశ్, షేక్ రియాజ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగీకార్ ర్యాలీలో ఎమ్మెల్సీ అనురాధ

అంగీకార్-2025లో భాగంగా ఎంటీఎంసీ పరిధిలోని లక్ష్మీనరసింహస్వామి కాలనీలో గురువారం ఫైనాన్షియల్ లిటరసీ, డిజిటల్ ట్రాన్సాక్షన్స్‌పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అనురాధ మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక అక్షరాస్యత ఉంటే కుటుంబ ఆదాయం సరైన రీతిలో నిర్వహించేందుకు వీలుంటుందని చెప్పారు. పొదుపు చేసుకునేందుకు ప్రణాళికలు చేసుకోవాలని, ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు ఖర్చులను నియంత్రించుకోవాలని సూచించారు. మహిళలు డిజిటల్ పేమెంట్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కే.శకుంతల, స్వచ్ఛాంధ్ర మిషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మీ, జీఎస్టీ అధికారి నక్కా పద్మనాభం, ఏపీ టిడ్కో సీఎల్‌టీసీ కే.ప్రభురాణి, స్వయం సహాయక సంఘాల సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెంగళాయపాలెం చెరువును పరిశీలించిన ఉప కమిషనర్



చెరువును పరిశీలిస్తున్న వాటర్ షెడ్ ప్రోగ్రాం ఉప కమిషనర్ సాగర్, డ్వామా పీడీ శంకర్

గుంటూరు (తూర్పు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంలోని 21.38 ఎకరాల చెరువును ఎంజీఎన్‌ఆర్‌ఈజీ ఎస్ వాటర్‌షెడ్ ప్రోగ్రాం డిప్యూటీ కమిషనర్ సాగర్ పరిశీలించారు. చెరువును అభివృద్ధి చేసి మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలపై అధికారులతో చర్చించారు. వెంగళాయపాలెంతో పాటు, చినపలకలూరు ప్రాంతాల్లో పర్యటించి ఆయా చెరువులను పరిశీలించారు. చెరువు చుట్టూ రెవిట్మెంట్, వాకింగ్ ట్రాక్, ప్లాంటేషన్, ఓపెన్ జిమ్, పిల్లల పార్కు తది తర సదుపాయాల కల్పనకు అనువుగా ఉన్న అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వి.శంకర్, గ్రామ సర్పంచ్ నల్లపాటి లలితాకుమారి, ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివా సరావు, పంచాయతీ కార్యదర్శి వి.రవి, ఏపీవో ఆర్ శ్రీరామ్ పాల్గొన్నారు.

పశు సంపద తగ్గిపోకుండా చూసుకోవాలి

● పశుసంవర్ధకశాఖ జేడీ



సమావేశంలో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ జేడీ కేవీవీ సత్యనారాయణ

ప్రత్తిపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పశు సంపద తగ్గి పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందని పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కేవీవీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని నడింపాలెంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మేలుజాతి దూడల ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ పశు సంపద అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా లింగ నిర్ధారిత వీర్యం వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు. అనంతరం దూడలకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ టీ శంకరరావు, ప్రత్తిపాడు అసిస్టెంట్ డైరెక్టర్ కె.సుగణ్యారావు, పశువైద్యులు హరీశ్, నందకిషోర్, తెలుగుదేశం పార్టీ నాయకులు వెలివెల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి : ఎంపీడీవో

తాడికొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా పంచాయతీ సెక్రటరీలు పనిచేయాలని ఎంపీడీవో కె.సమతావాణి పేర్కొన్నారు. గురువారం తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ సెక్రటరీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామస్థులకు తాగునీటిని సమక్రమంగా అందించాలని, పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవగాహన కల్పించాలని, మీసేవా ద్వారా పంచాయతీలకు వచ్చే పేమెంట్లను ఎప్పటికప్పుడు వసూలు చేయాలని సూచించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు, జీఎస్టీ, తల్లికి వందనంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు అనిల్‌కుమార్, అరుణ్‌కుమార్, రమణయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మందడం స్కూల్‌కు పూర్వ విద్యార్థి రూ.లక్ష విరాళం

● పీ-4 కింద నలుగురు విద్యార్థుల దత్తత



పీ-4 కింద విద్యార్థులను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటిస్తున్న ముప్పవరపు కృష్ణారావు

తుళ్లూరు, (మందడం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మందడం జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ముప్పవరపు కృష్ణారావు గురువారం పాఠశాలకు రూ. లక్ష ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. స్కౌట్ అండ్ గైడ్స్ డ్రెస్సెస్ నిమిత్తం రూ. 60 వేలు, క్రీడా పరికరాల కొనుగోలుకు రూ. 40 వేలు అందిస్తున్నట్లు చెప్పారు. పాఠశాలలో స్కూల్ ఆఫ్ గేమ్స్ ఫెడరేషన్ మండల సెలక్షన్ క్రీడలను ముప్పవరపు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో పీ-4 కింద నలుగురు విద్యార్థులను దత్తత తీసుకుంటున్నట్టు తెలిపారు. తాను చదువుకున్న పాఠశాలకు సహాయం అందించటం ఎంతో ఆనందంగా ఉందని, అది తన బాధ్యతని అన్నారు. జీఎస్టీ తగ్గింపుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నగేశ్, ఉపాధ్యాయులు మదుకూరి అశోక్, మండలంలోని అన్ని పాఠశాలలలో పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

నేటి నుంచి కేఎల్‌యూలో సమ్యక్- 2025 జాతీయ సదస్సు

తాడేపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ప్రతి ఏటా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం సమ్యక్-2025 వేడుకలు వడ్డేశ్వరంలోని గ్రీన్ ఫీల్డ్ క్యాంపస్‌లో ఈ నెల 10, 11వ తేదీల్లో రెండు రోజుల పాటు జరుగుతాయని యూనివర్సిటి వైస్ చాన్స్‌లర్ జి.పార్థసారధి వర్మ తెలిపారు. ఈ మేరకు గురువారం సమ్యక్- 2025 పోస్టర్‌ను సమ్యక్ చైర్మన్ డాక్టర్ శ్రీనాథ్ తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటి చైర్మన్ అనిమిని రవినాయుడు, ఫెనామ్ ఇంక్ హెచ్ ఆర్‌టీఏ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, చలనచిత్ర నిర్మాత కోనేరు నిఖిల కార్తికేయన్ హాజరు కానున్నారని చెప్పారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాల నుంచి ఆయా కళాశాలలు, యూనివర్సిటిలకు చెందిన 25వేలకు మందికి పైగా విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. సమ్యక్ చైర్మన్ డాక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ ప్రదర్శనలో 450కి పైగా విద్యార్థుల ప్రాజెక్టులు, అత్యాధుని ఆవిష్కరణలను పరిశోధనలను ప్రదర్శించనున్నారని చెప్పారు. కార్యక్రమంలో కేఎల్ వర్సిటీ ఆర్‌అండ్‌డీ డీన్ బీపీటీ మాధవ్, సమ్యక్ కన్వీనర్లు ప్రిన్సిపాల్ కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్ వి.రాజేష్, ఎంహెచ్‌ఎస్ డీన్ కిషోర్‌బాబు, ఎఫ్ఈడీ ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

● హౌసింగ్ పీడీ ప్రసాద్

దుగ్గిరాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం జీఎస్టీని తగ్గింపుతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మంగళగిరి నియోజకవర్గ ప్రత్యేక అధికారి, హౌసింగ్ పీడీ జీఎస్‌వీఆర్‌కే ప్రసాద్ అన్నారు. జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసరాలు, ఆరోగ్యం, జీవిత బీమా, మందులు అందుబాటు ధరల్లో లభ్యమవుతాయని చెప్పారు. దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు గ్రామంలో గురువారం జరిగిన జీఎస్టీ అవగాహన సదస్సులో ప్రసాద్ మాట్లాడారు. ఎంపీడీవో అడిగొప్పుల శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో జవహర్‌లాల్, ఏపీవో సురేశ్, ఈవో శ్రీనివాసరావు, సర్పంచ్ పలుకూరి మేరిమ్మ, ఎంపీటీసీ కొప్పుల మధుబాబు, వాసిరెడ్డి శ్రీనివాసరావు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

● ఫిరంగిపురం మండలంలోని వేములూరి పాడులో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో గురువారం సూపర్ జీఎస్టీ, సూపర్ పొదుపు కార్యక్రమాన్ని నుదురుపాడు ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ అబ్దుల్ రెహ్మాన్, గ్రామ పెద్దలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● పెదనందిపాడు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారు నందకుమార్, ప్రియంవధ, అశోకా పాఠశాల డైరెక్టర్ పోపూరి లక్ష్మీనారాయణ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడికి గ్రామస్థుల వినతి



చిర్రావూరు పశువైద్యశాలకు శాశ్వత సిబ్బందిని నియమించాలి

తాడేపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిర్రావూరులో ఉన్న పశువైద్యశాలకు శాశ్వత ప్రాతిపదికన సిబ్బందిని నియమించాలని మంత్రి అచ్చెన్నాయుడిని ఆ గ్రామ నేతలు, గ్రామస్థులు కోరారు. ఈ మేరకు వారు గురువారం మంత్రి అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని నేతలు తెలిపారు. కృష్ణానది వరదల వల్ల నదీతీర పంట పొలాలకు జరిగిన నష్టాన్ని గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా... ప్రభుత్వంతో మాట్లాడి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్, చిర్రావూరు గ్రామ అధ్యక్షుడు కాసరగడ్డ శ్రీనివాసరావు, నల్లిబోయిన శ్రీనివాసరావు, మక్కపాటి యేసుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యలక్ష్మీ అమ్మవారికి పచ్చల హారం బహూకరణ



పచ్చల హారం అందుకుంటున్న ఈవో సునీల్‌కుమార్

మంగళగిరి సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి క్షేత్రం దిగువ సన్నిధిలో కొలువైన శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారికి దాతలు పచ్చల హారం బహూకరించారు. మంగళగిరి పట్టణానికి చెందిన నీలి నాగమల్లేశ్వరరావు, రత్నకుమారి దంపతులు సుమారు రూ.3 లక్షల 50 వేల వ్యయంతో పచ్చలహారం తయారుచేయించి అమ్మవారికి కానుకగా సమర్పించారు. దాత కుటుంబసభ్యులు గురువారం ఈ హారాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.సునీల్‌కుమార్‌కు అందజేశారు.

ఆంజనేయ కాలనీలో అట్లతద్ది వేడుకలు



అట్లతద్ది సందర్భంగా ఊయల ఊగుతున్న మహిళ


మంగళగిరి సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణంలోని ఆంజనేయకాలనీలో అట్లతద్ది వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళలు సూర్యోదయానికి ముందే నిద్రలేచి సంప్రదాయాన్ని అనుసరించి సహపంక్తి భోజనాలను ఆచరించారు. కాలనీలోని బోరింగ్ పంపు సెంటరు వద్ద శ్రీసీతారామ భక్తసమాజం ఆధ్వర్యంలో ఊయల ఏర్పాటు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఊయలలూగుతూ పండుగను సంతోషంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో శ్రీసీతారామ భక్త సమాజం ప్రతినిధులు గుత్తికొండ ధనుంజయరావు, వంగర లక్ష్మయ్య, గద్దె శ్రీమన్నారాయణ, తిరువీధుల అరుణ్‌బాబు, తాటి సాంబశివరావు, జంజనం వీరులు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను చంపుతానంటూ హెచ్చరికలు

● పోలీసుల అదుపులో నిందితుడు

గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : సీఎంను చంపుతానంటూ మంగళగిరి పట్టణంలో ఓ యువకుడు హెచ్చరికలు చేయడం తీవ్ర కలకలం రేపింది. కొద్దిరోజులుగా హెచ్చరిస్తున్న ఆ యువకుడు తాజాగా బహిరంగ హెచ్చరికలకు దిగడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయా హెచ్చరికలపై మంగళగిరి టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. నిందితుడిని కృష్ణాజిల్లా కొండపల్లికి చెందిన వెంకటేశ్వర్లుగా గుర్తించారు. కొద్ది సంవత్సరాలుగా వెంకటేశ్వర్లు మంగళగిరి పట్టణంలో నివాసం ఉంటున్నాడు. మద్యం తాగుతూ జులాయిగా తిరుగుతూ ఉంటాడు. అయితే సీఎంను చంపుతాను అంటూ వెంకటేశ్వర్లు చేసిన హెచ్చరికల నేపథ్యంలో పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. దీనిపై ఆరాతీస్తున్నారు.

ఏఎన్‌యూ రెక్టార్ శివరామప్రసాద్‌కు సత్కారం



ప్రొఫెసర్ శివరామప్రసాద్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య

పెదనందిపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలో ని పుసులూరు గ్రామానికి చెందిన పీఏఎస్ కళాశాల పూర్వ విద్యార్థి ఆర్.శివరామప్రసాద్‌ను గురువారం కళాశాలలో ఘనంగా సత్కరించారు. శివరామప్రసాద్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ కామర్స్ డిపార్ట్‌మెంట్ శాఖాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ఆయనను రెక్టార్ (ప్రో.వైస్ చాన్స్‌లర్)గా నియమించారు. ఈ మేరకు శివరామప్రసాద్‌ను కళాశాలలో ఘనంగా సత్కరించారు. కళాశాల అధ్యక్షుడు కాళహస్తి సత్యనారాయణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ లావు రత్తయ్య, కోశాధికారి లావు ఆదిశేషయ్య, జాయింట్ సెక్రటరీ నర్రా బాలకృష్ణ, ప్రిన్సిపాల్ జి.వీరరాఘవయ్య, వ్యాయామ అధ్యాపకులు పాతూరి శ్రీనివాసరావు, తదితరులు అభినందనలు తెలిపారు.

టీటీడీ ఆడిట్ సమావేశంలో ఎమ్మెల్యే బూర్ల



టీటీడీ ఆడిట్ సమావేశంలో పాల్గొన్న బూర్ల రామాంజనేయులు, అధికారులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థాన ఆడిట్ సమావేశంలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యుడు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు. ఆలయ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరితో పలు అంశాలపై ఆయన చర్చించారు. ఇంటర్నల్ ఆడిట్, ఆస్తులు లేని ఆలయాలు, గ్రామ దేవతలకు ఆర్థిక సాయం, ఎస్సీ ఎస్టీ బీసీ కాలనీలో ఆలయాలు పునర్నిర్మాణంతో పాటు ఇటీవల వెలుగులోకి వచ్చిన ఆలయ హుండీల నిధుల స్వాహా వంటి అంశాలపై చర్చించారు. అనంతరం అధికారులు పీఏసీ సభ్యులకు ప్రసాదాన్ని అందజేశారు.

శారీరక వ్యాయామంతో ఒత్తిడి దూరం

● కోన శశిధర్

మంగళగిరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ శారీరక వ్యాయామం అలవాటు చేసుకుని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలని ఏపీ పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్ సూచించారు. మంగళగిరిలోని డాక్టర్స్ క్రికెట్ మైదా నంలో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో లీప్ క్రికెట్ టోర్నీ-2025 గురువారం ప్రారంభమైంది. ఐదు రోజులపాటు జరగనున్న ఈ క్రికెట్ టోర్నీలో వివిధ జిల్లాల నుంచి పాఠశాల విద్య, సమగ్ర శిక్ష నాన్‌టీచింగ్ సిబ్బంది తర పున 16 జట్లు పాల్గొననున్నాయి. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ, ఇటీ వల విద్యాశాఖలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ, బదిలీలు, పదోన్నతు లను విజయవంతం చేయడానికి నాన్‌టీచింగ్ సిబ్బంది ముఖ్యభూమిక పోషిం చారని కొనియాడారు. పని ఒత్తిడి నుంచి మానసికోల్లాసాన్ని కలిగించేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అన్ని శాఖలకు మించి విద్యా శాఖ సిబ్బంది కృషి చేయడం వల్లనే ఎన్నో విద్యా సంస్కరణలను సక్రమంగా అమలు చేయగలిగామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజధాని పారిశుధ్య కార్మికులతో వెట్టి చాకిరీ

● నేడు గ్రీవెన్స్‌కు సామూహిక రాయబారం

● పారిశుధ్య కార్మిక గౌరవ సంఘం అధ్యక్షుడు ఎం.రవి




రాయపూడిలో నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

తుళ్లూరు, అక్టోబరు 9: రాజధాని అమరావతిలో పారిశుధ్య కార్మికులతో వెట్టి చాకిరి చేపించడంలో చూపే శ్రద్ధ వారికి జీతాలిచ్చే విషయంలో ఎందుకు చూపటం లేదని పారిశుధ్య కార్మిక గౌరవ సంఘం అధ్యక్షుడు ఎం.రవి అన్నారు. మూడు నెలల గడుస్తున్నా తమకు జీతాలిచ్చేందుకు అధికారులకు చేతులు రావడంలేదని వాపోయారు. కార్మికుల సంఖ్య పెంచకుండా పనిభారంతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని, వేధింపులు తట్టుకోలేక 300 మంది కార్మికులు మానేశారని చెప్పారు. గురువారం రాయపూడి, తుళ్లూరు, నెక్కల్లు గ్రామాల్లో పని విరామ సమయంలో నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో శుక్రవారం జరిగే గ్రీవెన్స్ డేలో సమస్యల పరిష్కారానికై సామూహిక రాయబారం నిర్వహించి అర్జీలు అందజేస్తామని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలు ప్రశ్నించాలని, వారి న్యాయమైన కోరికలకు మద్దతు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

పాడి రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

● కంతేరు సొసైటీ అధ్యక్షుడు వాసిరెడ్డి జయరామయ్య



పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న కంతేరు సొసైటీ అధ్యక్షుడు వాసిరెడ్డి జయరామయ్య

తాడికొండ (కంతేరు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాడి రైతులకు అండగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కంతేరు సొసైటీ అధ్యక్షుడు వాసి రెడ్డి జయరామయ్య అన్నారు. గురువారం తాడికొండ మండలం కంతేరులో పశుసంవర్ధక శాఖ- ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జయరామయ్య మాట్లాడుతూ శిబిరంలో 86 గేదెలకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా చూడి పరీక్షలు, ఎద పరీక్షలు, దూడలకు నట్టల నివారణ మందులు గాలికుంటు వ్యాధి నిరోధక టీకా లు, సాధారణ వ్యాధులకు చికిత్సలు చేశారన్నారు. 325 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరి బండ్ల కోటేశ్వరరావు, పశుగణాభివృద్ధి సంస్థ ఉపసంచాలకులు డాక్టర్ సుధాకర్, తాడికొండ ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వై.రాయపరెడ్డి, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

శ్రీశైలం దేవస్థానం ధర్మకర్త రమణకు సన్మానం



శ్రీశైలం దేవస్థానం ధర్మకర్త రమణను సత్కరించిన నేతలు

మంగళగిరి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడిగా నియమితులైన రమణను మంగళగిరి నియోజకవర్గ టీడీపీ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. తాడేపల్లి మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో రమణకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ గుండిమెడ గ్రామ అధ్యక్షుడు చిగురుపాటి సుబ్బారావు, చిర్రావూరు అధ్యక్షుడు కాసరగడ్డ శ్రీనివాసరావు, నియోజకవర్గ అధికార ప్రతినిధి నల్లిబోయిన శ్రీనివాసరావు, మక్కపాటి ఏసుప్రసాద్, వెంకట కృష్ణారావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేషనల్ మెరిట్ పుస్తకాల బహూకరణ

కాకుమాను, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు నేషనల్ మెరిట్ మీన్ స్కాలర్‌షిప్ కోచింగ్‌కు ఉపయోగపడే పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. గ్రామానికి చెందిన దాత అద్దేపల్లి రవీంద్రబాబు రూ.3 వేల విలువైన పాఠ్య పుస్తకాలను పాఠశాల హెచ్ఎం భాస్కరరావు చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

అవినీతి, ప్రజాధనం దుర్వినియోగంపై

మున్సిపల్ టీపీవో, ఏఈలకు చార్జి మెమో

తెనాలి అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో పనిచేసిన టీపీవో కె.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ ఇంజనీర్ కె.నాగభూషణంలకు ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి చార్జి మెమోలు జారీచేశారు. 2023లో అవినీతి, ప్రజాధనం దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదులు విచారించి మెమోను జారీ చేశారు. 15రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని, లేకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని బుధవారం ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జీఎస్టీ తగ్గింపు నిర్ణయం చారిత్రాత్మకం

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల్లో జీఎస్టీ తగ్గింపు నిర్ణయం చారిత్రాత్మకమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో గురువారం జీఎస్టీ తగ్గింపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహ్మద్ ఖుద్దూస్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ 15 రకాలుగా ఉన్న పన్ను చట్టాలను రద్దుచేసి ఒకే పన్ను విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిందన్నారు. నాలుగు రకాల శ్లాబులలో ఉన్న పన్ను శాతాన్ని గణనీయంగా తగ్గించడంతో గత కొంత కాలంగా ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. జీఎస్టీ తగ్గింపు వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేలకోట్ల ఆదాయం తగ్గిపోతుందని, అయినా కూడా ప్రజలకోసం ప్రభుత్వాలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. వాణిజ్య పన్నుల శాఖ గుంటూరు డివిజన్ జాయింట్ కమిషనర్ గీతామాధురి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం విస్తృతంగా సదస్సులు ఏర్పాటు చేస్తుందన్నారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విలాస వస్తువులుగా భావించే టీవీలు, ఎయిర్ కండిషనర్లు, సోలార్ హీటర్లు, ప్రొజెక్టర్లు, మానిటర్లు, ఇంజన్ భాగాలు, ద్విచక్ర వాహనాలు, చిన్నకార్లు, మూడు చక్రాల వాహనాలు, ప్రయాణికుల వాహనాలు 28శాతం నుంచి 18శాతం పన్నుకు తగ్గాయన్నారు. విద్యార్థులకు సంబంధించిన నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, మ్యాప్‌లు, పెన్సిళ్ళు, 12శాతం పన్ను ఉండగా పూర్తిగా రద్దుచేయడం జరిగిందన్నారు. తెనాలి అధికారి ముత్యాలరావు మాట్లాడుతూ నిత్యావసరాల నుంచి విలాస వస్తువుల వరకు పన్ను తగ్గించడం జరిగిందన్నారు. మందులపై ఉన్న జీఎస్టీని కూడా తగ్గించారని చెప్పారు. మున్సిపల్ మాజీ చైర్మన్ పెండ్యాల వెంకట్రావు, నన్నపనేని సుధాకర్, అనంతాచార్యులు తదితరులు ప్రసంగించారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి, వేదికపై జీఎస్టీ అధికారులు

● బుర్రిపాలెం రోడ్డులోని చంద్రకళా పీజీ కళాశాల, బీఈడీ కళాశాల, గుప్తా ఫార్మసీ కళాశాలల విద్యార్థులకు గురువారం జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో అత్తోట దీప్తి విద్యార్థులకు జీఎస్టీలో ఉన్న పన్ను విధానాన్ని తగ్గించిన వైనాన్ని వివరించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, దుర్గారావు, నరేష్, ఆసియా పాల్గొన్నారు.

● బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో గురువారం జీఎస్టీ తగ్గింపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ విద్యార్థులకు వస్తుసేవల పన్నులో కేంద్ర ప్రభుత్వం తగ్గించిన పన్ను శాతాలను వివరించారు. నేలపాడు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసు, అధ్యాపకులు జ్యోతిబసు, కళ్యాణ్ చక్రవర్తి, బార్గవి, నందగోపాలకృష్ణ పాల్గొన్నారు.


కొల్లిపరలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు, వివిధ శాఖాధికారులు, ఆరోగ్య సిబ్బంది

● పట్టణంలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో జీఎస్టీ అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ చింతల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉపయోగించే పుస్తకాలు, సైకిళ్ళు, రబ్బర్లు, చార్టులు, 12శాతం నుంచి 0శాతానికి తేవడం హర్షణీయమన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బి.వి.సుబ్బారావు పాల్గొన్నారు.



పొన్నూరులో సూపర్ జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

● జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ సామాన్యులకు అందుబాటులోకి ఔషధాల ధరలు వచ్చాయన్నారు. అరుదైన వ్యాధుల మందులను 12శాతం నుంచి పన్నులేకుండా చేశారని చెప్పారు. గైనకాలజిస్టు నరేంద్రసింగ్, వైద్యులు రామాంజనేయులు, రాధాబాయి, సూపరింటెండెంట్ రాజేశ్వరిలు పాల్గొన్నారు.


తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో జీఎస్టీ తగ్గింపుపై మాట్లాడుతున్న డాక్టర్ నరేంద్ర సింగ్

కొల్లిపర మండలంలో...

కొల్లిపర, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ ... సూపర్ సేవింగ్స్‌తో ప్రజలకు మేలు జరుగుతుందని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిధిలోని మున్నంగి, కొల్లిపర గ్రామాల్లో వైద్యాధికారులు, వివిధ శాఖాధికారులు సూపర్ జీఎస్టీపై ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో ర్యాలీని కొనసాగిస్తూ అధికారులు ప్రజలకు జీఎస్టీపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణి, వైద్యాధికారులు సుప్రియ, మణికంఠ, మాధురిలత, ఆరోగ్య సిబ్బంది సువర్ణకుమారి, ప్రియాంక పాల్గొన్నారు.

పొన్నూరులో...

పొన్నూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ కార్యక్రమం ద్వారా పేదలకు వైద్యం, ఖరీదైన మందులు అందుబాటులోకి వస్తున్నాయని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఫిరోజ్‌ఖాన్ అన్నారు. స్థానిక నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

14న జరిగే ధర్నాను జయప్రదం చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు

పెదకాకాని, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలంలోని పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 14వ తేదీన స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సుందరయ్య కాలనీలో ధర్నాపై ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ పెదకాకాని సుందరయ్య కాలనీ, వడ్డెర కాలనీ, ఎస్టీ కాలనీ, జాన్ హాస్పర్ స్వర్ణపురి కాలనీ ఎన్టీఆర్ కాలనీ తదితర కాలనీలో నివాసం ఉంటున్న పేదలకు వెంటనే పట్టాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ, జి.రాజారమేష్, బి.సాంబయ్య, ఎస్.నీలాంబరం. కే సత్యనారాయణ. కే రాఘవయ్య. ఏ నాగేశ్వరావు, సుందరయ్య కాలనీ వాసులు పాల్గొన్నారు.

జ్యోతిష్యం పేరుతో మోసం చేస్తున్న వారిపై ఫిర్యాదు

తెనాలి అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్ రోడ్డులో జ్యోతిష్య కేంద్రం నిర్వాహకురాలిపై బాధితులు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన దంపతులు, బాలాజీరావుపేటకు చెందిన మరో వ్యక్తి ఆమె బారినపడి నష్టపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈటీ కాలనీకి చెందిన చిన్నికృష్ణ దంపతులు రూ.74వేలు చెల్లించగా వెండితో చేసిన రంగు రాళ్ళను ఇచ్చిందని, కొన్ని రోజుల తర్వాత అవి వెండివి కావని తెలియటంతో మోసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలాజీరావుపేటకు చెందిన మరో వ్యక్తి కూడా రూ.35వేలు ఇచ్చి మోసపోయినట్లు ఫిర్యాదు చేశారు.


శ్రీకాంత్‌కు ల్యాప్‌టాప్ అందజేస్తున్న టీడీపీ నాయకుడు సాయి కృష్ణ

విద్యార్థికి టీడీపీ నేత ల్యాప్‌టాప్ బహూకరణ

పొన్నూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణానికి చెందిన విద్యార్థి శ్రీకాంత్‌కు ఉన్నత సాంకేతిక విద్య కోసం టీడీపీ సీనియర్ నాయకుడు పాములపాటి సాయికృష్ణ గురువారం ల్యాప్‌టాప్ బహూకరించారు. నిడుబ్రోలుకు చెందిన రాజవరపు శ్రీకాంత్ ఎన్ఐటీ దుర్గాపూర్‌లో ట్రిపుల్‌ఈ సీటు సాధించాడు. ఎన్ఐటీలో సీటు సాధించి ప్రతిభ చూపిన శ్రీకాంత్‌ను అభినందిస్తూ పాములపాటి సాయికృష్ణ లాప్‌టాప్‌ను అందజేశారు.

12న తెనాలిలో బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

తెనాలి అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదికను ఈ నెల 12న నిర్వహించనున్నట్లు వేదిక కమిటీ అధ్యక్షుడు దక్షిణామూర్తి తెలిపారు. రామలింగేశ్వరపేటలోని సుబ్రహ్మణ్య కల్యాణ మండపంలో గురువారం కార్యక్రమ కరపత్రాలను విడుదల చేశారు. నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో జరిగే వేదికను బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత 20ఏళ్ళుగా ప్రతి ఏడాది ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైష్ణవి కేటరర్స్ సహకారం అందిస్తుందన్నారు. తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా, తెలుగు ఉభయ రాష్ట్రాల బ్రాహ్మణ శాఖల అర్చక శాఖీయుల వివాహాలు నిర్వహించేందుకు శాఖాబేదం లేకుండా కార్యక్రమం ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సత్యకుమార్, వేణుధర్, ప్రకాశరావు, సత్యనారాయణమూర్తి, సోమయ్యశాస్త్రిలు పాల్గొన్నారు.

రేపు బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ అభినందన సభ

తెనాలి అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరామ్‌ప్రసాద్ అభినందన సభ ఈ నెల 11న జరుగుతుందని వేదిక బ్రాహ్మణ సేవా సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. నాజరుపేటలోని శ్రీవిద్యా శంకర భారతి నరసింహ సదనంలో ఆత్మీయసభ జరుగుతుందన్నారు. జిల్లాలోని బ్రాహ్మణ సోదరులంతా కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు శాసన సభ్యుడు నక్కా ఆనందబాబు, మాజీ చైర్మన్ ఆనందసూర్య, డైరెక్టర్ గంగాధర్, సమాఖ్య అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంలు పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో సూర్యనారాయణమూర్తి, శ్రీనివాసమూర్తి, ఆంజనేయులు, అనీల్‌కుమార్, పద్మజలు పాల్గొన్నారు.

గృహహింస కేసులో

ముగ్గురికి ఏడాది జైలు... జరిమానా

గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గృహహింస కేసులో ముగ్గురు నిందితులకు ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. పెదకాకాని పోలీసుస్టేషన్ పరిధిలోని నంబూరు గ్రామానికి చెందిన తాడిబోయిన సుమలతను భర్త తాడిబోయిన వీరాంజనేయులు, మామ తాడిబోయిన శివరామయ్య, అత్త శివమ్మ అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారంటూ 2019లో పెదకాకాని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు నమోదు చేసుకొని సమగ్రంగా దర్యాప్తు నిర్వహించి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. విచారించిన కోర్టు గృహహింస నిజమేనని తేలడంతో వారికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించింది.

వేద తర్క శాస్త్రాల్లో ప్రతిభ చాటిన తెనాలి విద్యార్థి

తెనాలి అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వ్యాకరణ, మీమాంస, వేదాంతం తర్క శాస్త్రాల్లో పినపాడుకు చెందిన విద్యార్థి కేదారేశ్వర శర్మ ప్రతిభ చూపారు. తిరుపతి కంచి మఠంలో గురువారం జరిగిన కార్యక్రమంలో కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతీ చేతుల మీదుగా ఉత్తీర్ణతా పత్రం అందుకున్నారు. ఈ శాస్త్రాల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. పీఠాధిపతి ఆయనను మంగళశాసనాలతో ఆశీర్వదించారు. పలువురు వేద పండితులు అర్చక సంఘాల ప్రతినిధులు శర్మకు అభినందనలు తెలిపారు.


పీఠాధిపతి నుంచి ప్రథమ శ్రేణి ఉత్తీర్ణత పత్రం అందుకుంటున్న కేదారేశ్వరశర్మ



సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు

వీవీఐటీలో అమేయా 2కే25 సాంకేతిక సదస్సు

పెదకాకాని, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ మెకానికల్ ఇంజనీరింగ్, ఐఈఐ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తారీఖులలో రెండు రోజులపాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు అమేయా-2కే25 సాంకేతిక వేడుకలను ఏపీ జెన్కో ఇంజనీర్ కె.బాలకృష్ణ ప్రారంభించారు. రెండురోజులపాటు జరగనున్న ఈ సదస్సులో జిగ్‌టెక్ పేపర్ అండ్ పోస్టర్ ప్రజెంటేషన్, ఆర్‌సీ కార్నెటీ, క్విజ్ వంటి సాంకేతిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు వివిధ సాంకేతిక కళాశాలల నుంచి 1800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.బాలకృష్ణ మాట్లాడుతూ సాంకేతిక సదస్సులలో పాల్గొనడం ద్వారా పోటీతత్వం, అధునాతన సాంకేతిక విధానాలు అలవరుతాయన్నారు. విద్యార్థులు సాంకేతిక మార్పులను గమనిస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వీవీఐటీయూ రిజిస్ట్రార్ వై.మల్లికార్జునరెడ్డి, డైరెక్టర్ రావెల నవీన్. మెకానికల్ విభాగాధిపతి టి.శ్రీనివాసరావు సంధానకర్త వి.కిరణ్ కుమార్, సేమ్ విద్యార్థి విభాగం సభ్యుడు ఎమ్.పవన్ సాయి, సీహెచ్ విష్ణు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో స్వచ్ఛ మున్సిపాలిటీగా పొన్నూరు

○ రూపురేఖలు మారుతున్న రహదారులు

○ డంపింగ్ యార్డు నుంచి 50 వేల టన్నుల వ్యర్థాల తరలింపు

○ సుందర వనంగా డంపింగ్ యార్డు

పొన్నూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పురపాలక సంఘం జిల్లాలోని స్వచ్ఛ పురపాలక సంఘంగా ఎంపికైంది. పొన్నూరు పట్టణంలో ఏడాదిన్నర క్రితం వరకు ఎటు చూసినా రహదారుల వెంట చెత్తాచెదారాలు ప్లాస్టిక్ వ్యర్థాలు మురుగునీటి నిల్వలతో అధ్వానంగా ఉండేవి. రహదారుల వెంట ప్రజలు రాకపోకలు సాగించాలంటే ముక్కులు మూసుకొని ముందుకు సాగాల్సిన దుస్థితి. గతంలో నిడుబ్రోలు డంపింగ్ యార్డ్‌లో భారీగా వ్యర్థాలు నిండిపోయి వ్యర్థాలు నిల్వ చేసే మార్గం లేక పారిశుధ్య సిబ్బంది రహదారుల వెంట ఎక్కడపడితే అక్కడ చెత్తను డంప్‌చేసి వెళ్లిపోయేవారు. గత పాలనా యంత్రాంగం నిర్లక్ష్య వైఖరి కారణంగా పొన్నూరు పురపాలక సంఘం స్వచ్ఛత పాటించడంలో పూర్తిగా వెనకబడిపోయింది. అంతేకాకుండా రహదారుల వెంట వ్యర్థాలు ఆహార పదార్థాలు నిల్వ ఉండటంతో పందుల స్వైరవిహారం ఒకవైపు, కుక్కల సంచారంతో ప్రజలకు తీవ్ర అవస్థలు పడ్డారు. వీధుల్లో చెత్త నిల్వవల్ల వ్యాధికారిక దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం పాలైన సంఘటనలు కోకొల్లలు. ఇలాంటి స్థితిలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏడాదిన్నరగా పొన్నూరు రూపురేఖలు క్రమేణ మారుతూ వచ్చాయి.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

అధ్వాన్న పారిశుధ్య పరిస్థితుల నుంచి స్వచ్ఛ మున్సిపాలిటీగా పొన్నూరు మారటంలో సమష్టి కృషి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పొన్నూరు రూపురేఖలు మార్చేందుకు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబును బదిలీపై తీసుకువచ్చారు. మొదట పట్టణంలో రహదారుల వెంట ఉన్న వ్యర్థాలను ప్రతిరోజు శుభ్రపరిచే కార్యక్రమంలో కమిషనర్ దగ్గర ఉండి చేయించడంతో వీధులు శుభ్రపడ్డాయి. ప్రతిరోజు వేకువజామున ఐదు గంటలకు పారిశుధ్య కార్మికులతో కలిసి వారికి నిధులు కేటాయించడంతో పాటు వారితో కలిసి పట్టణ వార్డుల్లో పర్యటించడం సత్ఫలితాలను ఇచ్చింది. ప్రజలను ప్రతిరోజు కలుసుకొని వారి సమస్యలు మొర ఆలకించడమే కాకుండా వ్యర్థాలు తొలగించడం వంటి చర్యలు చేపట్టడంతో వీధులు పూర్తిగా శుభ్రపడ్డాయి. రహదారుల వెంట చెత్త తొలగింపు చేపట్టడమే కాకుండా తిరిగి ఆ ప్రాంతంలో వ్యర్థాలు వేయకుండా మొక్కలు నాటించారు. అంతే కాకుండా డంపింగ్ యార్డులో భారీగా పేరుకుపోయిన చెత్త నిల్వలను తొలగించడానికి ప్రణాళికలు రూపొందించారు. జిందాల్ విద్యుత్ ప్లాంట్‌తో ఒప్పందం కుదుర్చుకొని వ్యర్థాలు తరలించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 50వేల టన్నుల వ్యర్థాలు తరలించడంలో సఫలీకృతమయ్యారు. డంపింగ్ యార్డులో ఖాళీ రావడంతో ప్రతిరోజు వచ్చే వ్యర్థాల సెగ్రిగేషన్ ప్రారంభమైంది. అంతేకాకుండా డంపింగ్ యార్డ్‌లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం ద్వారా సుందరంగా యార్డును తీర్చిదిద్దేందుకు కమిషనర్ రమేష్‌బాబు ప్రణాళికల రూపొందిస్తున్నారు.


నిడుబ్రోలు డంపింగ్ యార్డ్‌లో నాడు నేడు



అందరి సహకారంతోనే సాధ్యం: కమిషనర్ రమేష్ బాబు

పొన్నూరు పురపాలక సంఘం స్వచ్ఛ పురపాలక సంఘంగా మారటంలో పారిశుధ్య కార్మికుల నుంచి అధికారుల వరకు అందరి సహకారం, సమష్టి కృషి దాగి ఉందన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆలోచనలకు అనుగుణంగా ప్రతిరోజు 153మంది పారిశుధ్య కార్మికులతో కలిసి పట్టణ నుంచి ప్రతిరోజు వచ్చే 30 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను ఓవైపు జిందాల్ ఫ్యాక్టరీకి తరలించడంతో పాటు, చెత్తరహితంగా పొన్నూరు పట్టణాన్ని మార్చివేశామన్నారు. సమిష్టి కృషి వలన పొన్నూరు పురపాలక సంఘం జిల్లాలోనే స్వచ్ఛ మున్సిపాలిటీగా అవార్డు అందుకుందని ఆనందం వ్యక్తం చేశారు.


వ్యర్థాలు తొలగింపును పరిశీలిస్తున్న డీపీవో నాగసాయికుమార్

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

● డీపీవో నాగసాయికుమార్

తెనాలి క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నివాస ప్రాంతాల్లోను, రహదారుల వెంట పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని డీపీవో నాగసాయికుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలో స్వచ్ఛ పరిసరాలు, స్వచ్ఛ గ్రామాలు కార్యక్రమంలో భాగంగా కొలకలూరు, ఖాజీపేట, హాఫ్‌పేట గ్రామాల్లో రహదారుల వెంట ఉన్న వ్యర్థాలను, మురుగును జేసీబీలు, ట్రాక్టర్లతో తొలగించారు. గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని స్థానిక నాయకులు, గ్రామస్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో పంచాయతీలకు తోడ్పాటు అందించాలని కోరారు. గ్రామాల్లో ఖాళీ ప్రాంతాల్లో వ్యర్థాలు వేయకుండా మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అపరిశుభ్రత నెలకొంటే అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. బాటల వెంట మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని గ్రామస్థులను కోరారు. కార్యక్రమంలో సహాయ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ కరిముల్లా, ఆయా గ్రామ పంచాయతీల సిబ్బంది, స్థానిక నాయకులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

● నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ సాంబశివుడు

తెనాలి అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఖూనీ చేస్తోందని ఓటు చోరీకి పాల్పడి అధికారాన్ని కైవసం చేసుకుంటుందని నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు ఆరోపించారు. పట్టణంలో ఓటు చోరీకి నిరసనగా గురువారం సంతకాల సేకరణ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అక్టోబరు వరకు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేస్తామన్నారు. ఎన్నికల కమిషనర్ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో పారదర్శకంగా ఓటర్ల జాబితాలను రూపొందించాలని ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. వామపక్ష నాయకులు బాబుప్రసాద్, హుస్సేన్‌వలి, కాంగ్రెస్ నాయకులు పొన్నూరు శశి, శివకుమార్, పూర్ణచంద్రరావు, అయ్యప్ప, కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

ప్రతి నెలా సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలి

డ్వాక్రా మహిళలతో డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి

కొల్లిపర, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) డ్వాక్రా మహిళలు ప్రతి నెలా సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలని డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి అన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో డ్వాక్రా మహిళలతో ఆమె సమీక్ష నిర్వహించారు. డ్వాక్రా గ్రూపు సభ్యులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ పొదుపు సక్రమంగా లేకపోతే నష్టపోయేది డ్వాక్రా మహిళలేనన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు అదాయ అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే బ్యాంకు రుణాలను వినియోగించాలన్నారు. బ్యాంకులద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలన్నారు. స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రతి నెలా సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం వలన సంఘాలు మరింత బలోపేతం అవటానికి అవకాశం ఉందన్నారు. సమావేశంలో సీసీలు విజయకుమార్, మధు, పూర్ణయ్య. ఎమ్ఎస్ఏ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి

వడ్లమూడి ఎంపీపీ పాఠశాలలో ఎంఈవో తనిఖీ

చేబ్రోలు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి గౌడపాలెంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలను ఎంఈవో సుబ్బారావు పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులు, టీచర్ల హాజరు రిజిస్టర్లు, విద్యార్థుల హ్యాండ్‌బుక్స్‌ను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని, ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని ఎంఈవో సుబ్బారావు సూచించారు.


విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈవో సుబ్బారావు

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ


ట్రై సైకిళ్ళు అందజేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సభ్యులు

తెనాలి అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్ రోడ్డులో గురువారం దివ్యాంగులకు ట్రై సైకిళ్ళు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ప్రధాన కార్యదర్శి జి.వి.నారాయణ, పూర్ణచంద్‌ల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చంటి, వాకా సుబ్బారావు, పోతురాజు, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.